# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 68 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 08 మార్చి 2025


## ఏప్రిల్ లోగా బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నిక: లక్ష్మణ్




## 10న గ్రూప్-1 ఫలితాలు వెల్లడి






# దక్షిణాధి ప్రాతినిధ్యం తగ్గించే కుట్రలు

- డీ లిమిటేషన్‌తో సీట్ల తగ్గింపునకు ఎత్తులు
- దక్షిణ భారతంలో బిజెపికి 29 ఎంపి సీట్లే
- ఎక్కడా అధికారంలో లేకపోవడంతో కక్షతీర్చుకునే ప్రయత్నం
- ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో సిఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** దక్షిణాది రాష్ట్రాపై ప్రతీకారం తీర్చుకోవడానికే కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ నియోజకవర్గాల పునర్విభజన చేపడుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎక్కడా అధికారంలో లేమని, రామని తెలుసుకునే ఇలా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. జనాభా ప్రాతిపదిక పేరుతో అన్యాయం చేసేందుక మోడీ ఎత్తులు వేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు డీలిమిటేషన్ అంశంపై రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్న వేళ 'ఇండియా టుడే' నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో రేవంత్ రెడ్డి శుక్రవారం మాట్లాడారు. 'దక్షిణాదిలో భాజపాకు తగిన ప్రాతినిధ్యం లేదు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ.. ఆ పార్టీ సాధించిన 240లో దక్షిణాదిలో గెలిచింది కేవలం 29 స్థానాలే. దక్షిణాదిలోని ఏ ఒక్క రాష్ట్రంలో కూడా ఆ పార్టీ అధికారంలో లేదు. ఏపీలో జూనియర్ భాగస్వామిగా ఉంది. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని భాజపా భావిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలకు మేలు చేకూర్చేలా డీలిమిటేషన్‌కు సిద్ధమవుతోందని రేవంత్ రెడ్డి అన్నారు.కేంద్రం ఆదేశాల మేరకే దక్షణాది రాష్ట్రాలు

వివరాలు 2లో

## 2050 నాటికి దేశంలో 44 కోట్ల మంది ఊబకాయులు:ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):**ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఊబకాయం సమస్యను మరొకసారి ప్రస్తావించారు. 2050 నాటికి 44 కోట్ల మంది భారతీయులు ఊబకాయులు అవుతారని నొక్కిచెప్పేందుకు ఒక నివేదికను ప్రధాని ఉటంకించారు. అది దిగ్భ్రాంతికర, ప్రమాదకర సంఖ్య అని మోడీ పేర్కొన్నారు. ఊబకాయం సమస్యను అధిగమించేందుకు వంట నూనె వాడకాన్ని పది శాతం మేర తగ్గించాలని మోడీ మళ్లీ పిలుపు ఇచ్చారు. సకాలంలో చర్య తీసుకోని పక్షంలో భవిష్యత్తులో భారీ స్థాయిలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆయన హెచ్చరించారు. తీర ప్రాంత కేంద్రపాలిత ప్రాంతంలో పర్యటన సందర్భంగా దాద్రా, నగర్ హవేలి, దామన్, దయ్యూలో రూ. 2500 కోట్లు విలువ చేసే ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేసిన అనంతరం సిల్వాసాలో ఒక ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగించారు. సింగపూర్ ఒకప్పుడు కొద్ది మంది మత్సకారులు నివసించిన దీవి అని, కానీ, తన పౌరుల కఠిన శ్రమ కారణంగా స్వల్ప కాలంలోనే అభివృద్ధి చెందిన దేశంగా మారిందని మోడీ సభికులతో చెబుతూ, దాద్రానగర్ హవేలి, దామనఖ దయ్యూ కూడా అదే విధంగా మారవచ్చునని సూచించారు. కేంద్రపాలిత ప్రాంత ప్రజలు ఆ మార్పు తీసుకురాగలరు. ఆ కృషిలో వారికి దన్నుగా నిలిచేందుకు నేను సిద్ధం'

వివరాలు 2లో

## బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకులపై

# కేసీఆర్ సమీక్ష

- ఏప్రీల్ 27న జరిగే వేడుకలపై ప్రత్యేక సమావేశం
- పార్టీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం

**హైదరాబాద్,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకలపై పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఏప్రిల్ 27న జరగబోయే బహిరంగ సభపై పార్టీ నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆవిర్భావ రజతోత్సవ వేడుకలపై పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకలపై పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఏప్రిల్ 27న జరగబోయే



బహిరంగ సభపై పార్టీ నేతలతో కేసీఆర్ సుధీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆవిర్భావ రజతోత్సవ వేడుకలపై పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

వివరాలు 2లో




## తెలంగాణలో 21 మంది ఐపీఎస్‌ల బదిలీ

**హైదరాబాద్, 07 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థాన చలనం కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బదిలీ ఐన అధికారుల్లో ఒక అడిషనల్ డీజీ, ఇద్దరు ఐజీపీలు, ఇద్దరు డీఐజీలు ఉన్నారు. ఇద్దరు నాన్ క్యాడర్ ఎస్పీలకు సైతం స్థాన చలనం కల్పించారు. మిగిలిన 14 మంది ఎస్పీలను

వివరాలు 2లో

## ప్రభుత్వం ఆధ్వర్యంలో

# నేడు అఖిలపక్ష భేటీ

- ప్రజాభవన్ వేదికగా భట్టి అధ్యక్షతన సమావేశం
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న సిఎం రేవంత్
- కిషన్ రెడ్డి, బండి తదితరులను ఆహ్వానించిన భట్టి



**హైదరాబాద్,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):**పార్లమెంట్ మలివిడత సమావేశ్వాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో పెండింగ్ సమస్యలపై గళమెత్తేందుకు ఎంపిలు ఏకతాటిపై నడవాలని ప్రభుత్వం కోరుకుంటోంది. ఈక్రమంలో ప్రజాభవన్‌లో శనివారం అఖిలపక్ష ఎంపీల సమావేశం ఏర్పాటు చేసి, అన్ని పార్టీలకు ఆహ్వానం పంపించింది. కేంద్రంలో పెండింగ్ సమస్యల పరిష్కారం ఎంజెడాగా ఈ సమావేశం

వివరాలు 2లో



## నియోజకవర్గాలు ఒక్కటి కూడా తగ్గవు

- మోడీ నాయకత్వంలో త్వరలో జనగణన
- వచ్చే పార్లమెంట్ నాటికి మహిళా రిజర్వేషన్లు
- మహిళా దినోత్సవ శుభాకంక్షలు తెలిపిన కిషన్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** త్వరలోనే మోదీ నేతృత్వంలో జన గణన జరగబోతుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల పునర్విభజన జరగబోతుం దన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలు అవుతాయని పేర్కొన్నారు. ఇప్పుడున్న స్థానాల్లో ఏ ఒక్క సీటు తగ్గకుండా అసెంబ్లీ, లోక్ సభ స్థానాల పునర్విభజన జరుగుతుందని వెల్లడించారు. కావాలనే ఇక్కడున్న రేవంత్ సర్కార్.. బీఆర్ఎస్, డీఎంకే పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఏ ఒక్క సీటును కూడా తగ్గించే ఆలోచన తమకు లేదని చెప్పారు. కొంతమంది దక్షిణ భారతంలో ఆల్ పార్టీ మీటింగ్ అంటూ హడావుడి చేస్తున్నారు.. జనాభా లెక్కల సేకరణ చేస్తూ

వివరాలు 2లో

## ఎమ్మెల్సీ సీటు కోసం కాంగ్రెస్‌లో

# ఆశావహుల ఆశలు

- 5 ఎమ్మెల్సీ స్థానాలకు 20వ తేదీన పోలింగ్
- కాంగ్రెస్‌కు నాలుగు ఎమ్మెల్సీలు దక్కే అవకాశం
- సామా రామ్మోహన్ రెడ్డికి ఇచ్చే అవకాశం



**హైదరాబాద్,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రస్తుతం రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో 5 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మార్చి 29వ తేదీ నాటికి శాసన మండలిలో ఐదు స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఈ స్థానాలు భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 20వ తేదీన పోలింగ్ జరుగనుంది. దీంతో ప్రధాన పార్టీల్లోని ఆశావహులు ఎమ్మెల్సీ సీటు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు పొందేందుకు రాష్ట్ర స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు లాబీయింగ్‌లు చేస్తున్నారు. ఈ 5 సీట్లలో కాంగ్రెస్‌కు 4 దక్కే అవకాశం ఉంది. 4 ఎమ్మెల్సీలు గెలిచే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ పార్టీలో

వివరాలు 2లో



## అర్హులకు రేషన్ కార్డులు ఇస్తాం

### - మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ఖమ్మం,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** అర్హులైన వారికి తప్పకుండా రేషన్ కార్డులు ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. పేదవారి ప్రభుత్వం కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుని 15 నెలలు అయ్యిందని తెలిపారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీలను కొన్ని పూర్తి చేశాం, మిగిలిన వాటిని కూడా త్వరలోనే

వివరాలు 2లో

# మహిళల సాధికారితకు పెద్దపీట

- వారు స్వయం శక్తితో ఎదగాలన్నదే లక్ష్యం
- ఇందిరమ్మ రాజ్యంలో మహిళల ఆర్తికాభివృద్ది
- మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీతక్క



**హైదరాబాద్,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళలకు మంత్రి సీతక్క అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ రోజు మహిళలందరికీ శుభ దినం అని,మహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది ఇందిరమ్మ రాజ్యం అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన వెనువెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించింది ఉచిత ప్రయాణమే కాకుండా ఆ బస్సులకు ఓనర్లుగా మహిళలను చేయడం ప్రజా ప్రభుత్వం చేపట్టిన విజయం అన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని,

వివరాలు 2లో

## 2050 నాటికి దేశంలో 44 కోట్ల మంది ఊబకాయులు:ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

అని మోడీ ప్రకటించారు. 'దాద్రా నగర్ హవేలి, దామన్ దయ్యూ మనకు కేవలం కేంద్రపాలిత ప్రాంతంకాదు, కానీ మనకు గర్వకారణం, వారసత్వ సంపద. అది విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందింది' అని ఆయన పేర్కొన్నారు. మోడీ ఒక నివేదిక గురించి ప్రస్తావిస్తూ , 2050 నాటికి 44 కోట్ల మంది భారతీయులు ఊబకాయులు అవుతారని, అది దిగ్భ్రాంతికరమని, ప్రమాదకరమని అన్నారు. ప్రతి మూడవ వ్యక్తి ఊబకాయం కారణంగా తీవ్ర రుగ్మతలతో బాధపడవచ్చునని ఆయన హెచ్చరించారు. ప్రజలకు సరసమైన ధరల్లో, నాణ్యమైన జనరిక్ మందులు సమకూర్చడానికి కేంద్రం దేశవ్యాప్తంగా 25 వేల జన్ ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయగలదని మోడీ ప్రకటించారు.

## బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకులపై కేసీఆర్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఈ సన్నాహక సమావేశానికి కేటీఆర్, హరీశ్‌రావు, మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, కేఆర్ సురేశ్, బండా ప్రకాశ్, సబితా ఇంద్రారెడ్డి, కవిత, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వినోద్ కుమార్, ఎర్రబెల్లి దయాకర్ రావు, లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దేశపతి శ్రీనివాస్, శేరి సుభాష్ రెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

## తెలంగాణలో 21 మంది ఐపీఎస్‌ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

కూడా బదిలీ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలంను నియమించారు. బదిలీ అయిన అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలం, అదనపు డీజీ (పర్సనల్)గా అనిల్ కుమార్. అలాగే ఎస్పీఎఫ్ డైరెక్టర్‌గా కూడా అదనపు బాధ్యతలు. సీఐడీ డీజీగా ఎం.శ్రీనివాసులు, వరంగల్ కమిషనర్‌గా సన్‌ప్రీత్ సింగ్, నిజామాబాద్ కమిషనర్‌గా సాయి చైతన్య, రామగుండం కమిషనర్‌గా అంబర్ కిషోర్, ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధు శర్మ, భువనగిరి డీసీపీగా అకాంక్ష యాదవ్, మహిళా భద్రతా విభాగం ఎస్పీగా చేతన, నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా రూపేష్, కామారెడ్డి ఎస్పీగా రాజేష్ చంద్ర, సంగారెడ్డి ఎస్పీగా పారితోష్ పంకజ్‌లు బదిలీ అయిన వారిలో ఉన్నారు.

## అర్హులకు రేషన్ కార్డులు ఇస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3500 ఇళ్లను ఇచ్చే కార్యక్రమం వారంలో ప్రారంభమవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోలేని కారణంగా తులం బంగారం కొంత ఆలస్యమవుతుందని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అరాచకం సృష్టించిందని విమర్శించారు. వాటన్నింటినీ గాడిన పెడుతూ తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. ఎక్కడ తగ్గకుండా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని ఆలస్యమైనా నిలబెట్టుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## ఏప్రిల్ లోగా బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నిక: లక్ష్మణ్

**న్యూఢిల్లీ,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏప్రిల్ లోపు భాజపా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక పూర్తవుతుందని ఆ పార్టీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస అనేది గత చరిత్ర అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా భాజపా ఎదిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులను పోటీలో పెట్టిన ఏకైక పార్టీ తమదని చెప్పారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న భారాసకు అభ్యర్థులను నిలబెట్టలేని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసగించిందని విమర్శించారు. ప్రజలను ఆర్థికంగా శక్తిమంతం చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమన్నారు.



## దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గించే కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబ నియంత్రణను సమగ్రంగా అమలు చేశామని రేవంత్ రెడ్డి అన్నారు. మరో 30ఏళ్లు డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేయాలని, అప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ఏవిధంగా పెరుగుతుందో చూడాలన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రో రేటా విధానంలో సీట్ల పెంపు చేపడితే యూపీలో ప్రస్తుతం ఉన్న 80 సీట్లు 120కి పెరుగతాయన్నారు. తమిళనాడులో 39 నుంచి 60కి మాత్రమే చేరుతాయని అభిప్రాయ పడ్డారు. కేవలం దక్షిణాదిలోనే కాదని ఉత్తరాదిలోని పంజాబ్ వంటి రాష్ట్రాలకూ డీలిమిటేషన్ వల్ల నష్టం జరుగుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి బిమారీ రాష్ట్రాలకు మాత్రమే దీంతో లబ్ది జరుగుతుందని తెలిపారు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా పలువురు ముఖ్య నేతలను కలవనున్నారు. మరోవైపు.. 'ఇండియా టుడే' మీడియా సంస్థ నిర్వహించిన కాంక్లేవ్ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ.. మీరు కన్ఫ్యూజ్ అయినట్టే మేము మూడు లక్షల కోట్లే అప్పు అనుకున్నాం.. కానీ లెక్కలు చూస్తే రూ.7 లక్షల కోట్లు అప్పు ఉందని అన్నారు. కేసీఆర్ మూడు లక్షల కోట్ల అప్పే అని చెప్పారన్నారు. తెలంగాణలో 21 వేల కోట్లు రైతులకు రుణమాఫీ.. మూడు నెలల్లో చేసింది తమ ప్రభుత్వమేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని వెల్లడించారు. సౌత్ ప్రాతినిధ్యం తగ్గించే పనిలో బీజేపీ ఉందని పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణకు సౌత్ ఇండియా ప్రజలు కట్టుబడి ఉన్నారు.. ఇప్పుడు జనాభా ప్రకారం నియోజక వర్గాల విభజన అంటే ఎలా..? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మోడీ జన గణన చేస్తున్నారు.. దాంట్లో కుల గణన కూడా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ఇచ్చింది కాంగ్రెస్ అని తెలిపారు. ఇప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తాం అంటున్నామని చెప్పారు. మరోవైపు.. భాషను బలవంతంగా రుద్దొద్దని సూచించారు. ఎక్కువ మంది మాట్లాడే భాష హిందీ.. రెండో భాష తెలుగు అని చెప్పారు. సివిల్స్‌లో తెలుగుని తొలగించారని తెలిపారు. కాంగ్రెస్ కు యూత్ కాంగ్రెస్.. మహిళా కాంగ్రెస్ అనుబంధ సంఘాలు ఉన్నాయని వెల్లడించారు. కానీ మోడీకి ఈడీ, సీబీఐ, ఇన్‌కం టాక్స్‌లు అనుబంధ సంఘాలని విమర్శించారు.కాంగ్రెస్ ప్రజాస్వామ్యం ఎక్కువ.. అద్వానీ, మురళీమనోహర్ జోషి లాంటి వాళ్లను పక్కన పెడితే సైలెంట్‌గా ఉన్నారు.. తమ పార్టీలో రాజ్యసభ సీటు ఒక్కసారి ఇవ్వకపోతే జంతర మంతర్ లో ధర్నా చేస్తారు.. అంత ప్రజాస్వామ్యం ఉంటుంది కాంగ్రెస్ పార్టీలోనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బీజేపీలో అది సాధ్యమేనా అని అన్నారు. అదానీ 100 కోట్లు వెనక్కి ఇవ్వాలని పార్టీ చెప్పలేదు.. తాను భద్రాచలంలో రాముడి గుడి ఉందని చెప్పా.. మోడీ, అమిత్ షాలను పిలిచా ఇప్పటి వరకు రాలేదన్నారు. మరోవైపు.. హైదరాబాద్‌లో ఒలంపిక్స్ నిర్వహించండి అని తాను లేఖ రాశానని తెలిపారు. అహ్మదాబాద్ కంటే తమ దగ్గర ఇన్ఫ్రాస్టక్చర్ ఎక్కువ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రభుత్వం ఆధ్వర్యంలో నేడు అఖిలపక్ష భేటీ

(మొదటి పేజీ తరువాయి)

జరగనుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. అలాగే కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లకు ఆహ్వానం పంపారు. అలాగే తెలంగాణ ఎంపీలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి ఆహ్వానించారు.అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలోనే నిర్ణయించారు. జానారెడ్డి, భట్టి విక్రమార్క నేతృత్వంలో కమిటీని వేసి ఈసమావేశాన్ని నిర్వహించి రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన వాటాలు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై అఖిలపక్షంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా కేబినెట్‌లో తీర్మానం చేయడంతో పాటు భట్టి, జానా నేతృత్వంలో కమిటీని కూడా వేసింది. వెంటనే రంగంలోకి దిగిన కమిటీ.. స్వయంగా అన్ని పార్టీలకు సంబంధించిన ఎంపీలకు భట్టి ఫోన్‌లు చేసి సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో ఆల్ పార్టీ ఎంపీల సమావేశం నిర్వహించనున్నారు. భట్టి, జానారెడ్డి నేతృత్వంలో జరుగనున్న ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి కూడా హాజరుకానున్నారు. బీజేపీకి సంబంధించిన ఎంపీలను కూడా సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అందులో ప్రధానంగా కేంద్ర మంత్రులుగా ఉన్న బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు కూడా ఆహ్వానాన్ని పంపారు. స్వయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి వారిని సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. పార్లమెంటులో తెలంగాణ నుంచి బిజెపికి 8, కాంగ్రెస్‌కు 8మంది లోక్‌సభ సభ్యులు ఉన్నారు. అలాగే ఎఐఎం నుంచి అసదుద్దీన్ ఒక్కరే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బిఆర్ఎస్‌కు కేవలం రాజ్యసభలో మాత్రమే సభ్యులు ఉన్నారు.

## నియోజకవర్గాలు ఒక్కటి కూడా తగ్గవు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాల పునర్విభజన చేస్తామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి కార్యాలయంలో జరిగినకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి.. అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ స్థానాల్లో ఒక్కటి కూడా వదిలిపెట్టవద్దు.. కుటుంబ రాజకీయాలు వద్దు.. ఇది మంచి సంప్రదాయం కాదని కిషన్ రెడ్డి సూచించారు. మహిళను శక్తిగా కొలిచే సంప్రదాయం ఒక్క భారత్‌లోనే ఉందని అన్నారు. ఇంటిని నడిపే మాతృమూర్తి మహిళ అని పొగిడారు. పార్టీలో ఎలాంటి బాధ్యతలు ఇచ్చిన అద్భుతంగా మహిళా మోర్చా నేతలు పని చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మహిళలు బాగా పని చేశారు.. దేశ సరిహద్దుల్లో రక్షణ విభాగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే అత్యధిక మహిళా పైలట్లు ఇండియాలో ఉన్నారు.. ముస్లిం మహిళల కోసం ట్రిపుల్ తలాక్ రద్దు చేసిన ప్రభుత్వం మోదీది అని కిషన్ రెడ్డి తెలిపారు. ప్రసూతి సెలవులు 26 వారాలకు పొడిగించిన ఘనత మోదీ సర్కార్‌ది అన్నారు. కొత్త పార్లమెంట్ భవనంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లునే ఆమోదించారని పేర్కొన్నారు. మరోవైపు.. 2014-2019 తొలి తెలంగాణ ప్రభుత్వంలో మహిళా మంత్రి లేకుండా పాలన సాగిందని ఆరోపించారు. ఎక్కువ మంది మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ బీజేపీ అని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కాలికి గజ్జె కట్టి మండుటెండల్లో మహిళలు పాల్గొన్నారు.. కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ లానే పాలన చేస్తోందని మండిపడ్డారు. ఫ్రీ బస్ ఇచ్చిన రేవంత్.. అందులో తిరుగుతూ మిగిలిన హామీలు అమలు చేసినట్లు ఫీల్ అవ్వమని మహిళలకు చెబుతున్నారన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారు రావాల్సిన అవసరం ఉంది.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 90 శాతం మహిళా టీచర్లు, గ్రాడ్యుయేట్లు బీజేపీకి ఓటు వేశారని తెలిపారు. మహిళలు పిడికిలి బిగించి రేవంత్ సర్కారును నిలదీయాలని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## మహిళల సాధికారితకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)



ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని, అన్ని రంగాల్లో వారిని ముందంజలో ఉంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం ఫ్రీ ప్రయాణం నుంచి బస్సు ఓనర్లుగా మహిళలను మార్చాం అని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని అభిప్రాయపడ్డారు. పది మందికి ఉపాధి కల్పించే విధంగా మహిళలు ఎదిగారని సీతక్క చెప్పారు. ఇందిరా శక్తి క్యాంటీన్, పెట్రోల్ బంకులు, గ్రామీణ ప్రాంతాల్లో పౌల్టీ, పాడి పశువుల పెంపకం వంటి వినూత్న పథకాలు ప్రారంభించామన్నారు. మహిళా సంఘాలకు వ్యాపారం ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వము వడ్డీ లేకుండా రుణ సదుపాయం కల్పిస్తున్నామని వెల్లడించారు. 21 వేల కోట్లకు పైగా రుణాలిచ్చాం.. వడ్డీలు, చక్ర వడ్డీలు అప్పుల బాధకు కుటుంబాలు బలి కాకుండా వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వంలో మహిళలందరూ సంతోషంగా ఉన్నారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళా సంఘం అంటే ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ.. మహిళా సంఘంలో చేరడం వలన ఒక సామాజిక భద్రత ఉంటుందని మంత్రి సీతక్క తెలిపారు. అందుకే 60 ఏళ్లు దాటిన మహిళలకు మహిళా సంఘంలో చేర్చుకుంటున్నామన్నారు. మహిళలు చదువు మానేసి అనేక రకాల మానసిక వేదన గురైన సందర్భాలు ఉన్నాయి.. కాబట్టి 15 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు కూడా మహిళా సంఘంలో సభ్యులుగా చేర్చుకునే అవకాశం కల్పించామని చెప్పారు. మహిళా సంఘం సభ్యురాలుగా ఉండి ఏదైనా ప్రమాదంలో మృతి చెందితే వారికి 10 లక్షల ఇన్సూరెన్స్ లోన్ బీమా అందిస్తున్నామన్నారు. మహిళలు వంటగదికే పరిమితం కాకుండా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని సీతక్క తెలిపారు. అదానీ, అంబానీలకే పరిమితం అయిన సోలార్ విద్యుత్ ఎ÷-లాంట్లను మహిళా సంఘాలకు అప్పగిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరి సోదరుడుగా అండగా ఉంటూ ప్రజా పాలన అందిస్తున్నారని వెల్లడించారు. మహిళలు ఏ బిజినెస్ పెట్టుకోవాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఒక సోదరుడుగా అండదండగా నిలబడి పనిచేస్తున్నారు.. మహిళలంతా ఈ ప్రభుత్వాన్ని దీవించండని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ సీటు కోసం కాంగ్రెస్‌లో ఆశావహుల ఆశలు

(మొదటి పేజీ తరువాయి)

ఆశావహుల తాకిడీ ఎక్కువైంది. టిక్కెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఎమ్మెల్సీ రేసులో జీవన్ రెడ్డి, జగ్గారెడ్డి, వేం నరేందర్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, జట్టి కుసుమ కుమార్, కుమార్ రావు, హర్కార వేణు గోపాల్ రావు, అంజన్ కుమార్ యాదవ్, చరణ్ కౌశిక్, సునీతా రావు, సరితా యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి. వీరంతా పార్టీ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వరి ప్రయత్నాలు ఎలా ఉన్నా.. ఎమ్మెల్యే కోటాలో టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీ కన్ఫామ్ అయినట్లు సమాచారం అందుతోంది. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్‌గా, పార్టీ అధికార ప్రతినిధిగా ఎదిగారు సామ. అడ్వకేట్‌గా, మీడియా స్పోక్స్‌పర్సన్‌గా కాంగ్రెస్ పార్టీకి ఎన్నో విధాలుగా సేవలు అందిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో సామ కృషి కూడా ఉందని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. బలమైన బీఆర్ఎస్ పార్టీ నేతలను తన వాగ్ధాటితో ఎదుర్కొని.. ప్రజల్లో నాటి ప్రభుత్వ తీరును, అరాచకాలను, అక్రమాలను ఎండగట్టిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. యువ నాయకుడిగా.. నిత్యం ప్రజలతో మమేకమవుతూ వచ్చిన సామకు ఎమ్మెల్సీ ఇస్తే పార్టీకి మరింత ప్రయోజనం చేకూరుతుందంటున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. యువతకు అవకాశాలు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ మరింత బలపడే అవకాశం అధికంగా ఉంటుంది. అందుకే.. రాష్ట్రంలోనూ యువ నాయకులను పార్టీ ప్రోత్సహిస్తోంది. అందులోనూ సామా రామ్మోహన్ రెడ్డి చాలా నేర్పరి. బీఆర్ఎస్‌లోని అగ్ర నాయకులను సైతం ఎదుర్కొన్న రాజకీయ చతురత కలిగిన నాయకుడు. ఇలాంటి నాయకుడికి ఎమ్మెల్సీ ఇస్తే.. యువతకు మంచి సందేశం పంపినట్లు అవుతుందని పార్టీలోని యువ నాయకులు అభిప్రాయపడుతున్నారు. కేవలం టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్‌గానే.. విపక్ష నాయకులను చెడుగుడు ఆడుకుంటున్న సామకు.. ఎమ్మెల్సీ ఇస్తే మరింత బలం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. కష్ట సమయాల్లోనూ కాంగ్రెస్‌కు అండగా ఉంటూ.. కాంగ్రెస్ అధికారి ప్రతినిధిగా సేవలందించిన సామకే ఎమ్మెల్సీ ఇవ్వాలని పార్టీలోని యువ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సామకు ఎమ్మెల్సీ ఇస్తే.. పార్టీలో యువతను మరింత ప్రోత్సహించినట్లు అవుతుందని తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## 10న గ్రూప్-1 ఫలితాలు వెల్లడి

**• ప్రకటించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్**



**హైదరాబాద్,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రూప్స్ ఫలితాల వెల్లడికి టీజీపీఎస్సీ తేదీలను ఖరారు చేసింది. ఈ నెల 10వ తేదీన గ్రూప్-1 ఫలితాలను వెల్లడించనుంది. 10 నుంచి 18వ తేదీ మధ్య గ్రూప్-1, 2, 3 ఫలితాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గ్రూప్-2 ఫలితాలకు సంబంధించి 11వ తేదీన జనరల్ ర్యాంకింగ్ జాబితా ప్రకటించనున్నారు. గ్రూప్-3 ఫలితాలకు సంబంధించి 14న జనరల్ ర్యాంకింగ్ జాబితా విడుదల చేయనున్నారు. ఈ నెల 17న హాస్టల్ వెల్ఫేర్ తుది ఫలితాలను, 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ÷నైల్ ఫలితాలను ప్రకటించనున్నట్లు టీజీపీఎస్సీ అధికారులు వెల్లడించారు రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రధాన పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ముగిసింది. అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితా వెల్లడికి టీజీపీఎస్సీ తుది పరిశీలన కొనసాగిస్తోంది. షెడ్యూల్ ప్రకారం.. మార్చి 10న గ్రూప్-1 ఫలితాల విడుదల, అదే రోజు అభ్యర్థుల ప్రొవిజినల్ మార్కుల వివరాలనూ వెల్లడించనుంది. అనంతరం ఆయా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుంది. మార్చి 11న గ్రూప్-2 జనరల్ ర్యాంకింగ్ జాబితాను ప్రకటించనుంది. 14న గ్రూప్-3 జనరల్ ర్యాంకింగ్ జాబితాను కమిషన్ వెల్లడించనుంది. 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ తుది ఫలితాలు విడుదల చేయనున్నారు.

## బీసీలపై చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ పదవి బీసీలకు ఇవ్వాలి

**• ఈటలను వేధించి ఎందుకు బటయకు పంపారు • బీసీలపై కవిత మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది : ఎంపీ రఘునందన్‌రావు**

**సిద్దిపేట,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాజకీయ లబ్ధికోసం బీసీలపై ప్రేమ ఉన్నట్టు ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతున్నారు.. తప్ప బీసీలకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ పార్టీనేనని ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. కవితకు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్‌తో మాట్లాడి పార్టీ ప్రెసిడెంట్ పదవి బీసీకి ఇప్పించాలని కవితకు సవాల్ విసిరారు. బీసీలకు అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని విమర్శలు చేశారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడారు. శాసనసభలో పార్టీ ప్రతిపక్ష నాయకుడిని బీసీ నేతకు ఇవ్వండి. శాసన మండలిలో కూడా మరో బీసీ నేతకు ఇవ్వాలని ఛాలెంజ్ చేశారు. ఇచ్చిన నాలుగు మంత్రి పదవులు బీసీలకు ఎందుకు ఇవ్వరని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఈటెల రాజేందర్ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు బీసీల్లో పెద్ద సామాజిక వర్గానికి చెందిన ఈటెలను మధ్యలోనే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. కేసీఆర్ కుటుంబానికి పదవులు కావాలి.. మరి బీసీలకు పదవులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ రోజు ఫామ్‌హౌస్ చర్చలో కేసీఆర్‌తో తాను చెప్పిన విషయంపై కవిత మాట్లాడాలని సవాల్ విసిరారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అవకాశం వస్తే బీజేపీలో ఒక మహిళకు ఇచ్చామని గుర్తుచేశారు. మొదటి ఐదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క మహిళకు కూడా మంత్రి పదవి ఇవ్వలేని ఒకే ఒక కేబినెట్ ఈ దేశంలో ఏదైనా ఉంటే అది కేసీఆర్ కేబినెట్ అని విమర్శించారు. బీజేపీని విమర్శించే ముందుగా బీఆర్ఎస్ చేసిన తప్పులు సరిదిద్దుకోవాలని చెప్పారు. బీజేపీ వైపు వేలెత్తి చూపించే బదులు ముందుగా బీఆర్ఎస్ నేతలు తప్పులు సరిదిద్దుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు హితవు పలికారు.

# వేతనాలు ఇవ్వాలని సమ్మె చేస్తున్న కెఎంసి కార్మికులు

- సమ్మె శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్





**హనుమకొండ,మార్చి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ వైద్య కళాశాల ఉమెన్స్ అండ్ మెన్స్ హాస్టళ్లల్లో పనిచేస్తున్న కార్మికులకు గత 8 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని ఈరోజు కాకతీయ వైద్య కళాశాల మెయిన్ గేట్ ముందు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. యాద నాయక్ మాట్లాడుతూ.. ఎనిమిది నెలల పెండింగ్ వేతనాల కోసం గతంలో వివిధ రూపాల్లో ఆందోళన, పోరాటాలు, జిల్లా,రాష్ట్ర స్థాయి అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన కూడ పెండింగ్ వేతనాలు చెల్లించి, అధికారులకు ముందస్తుగా సమ్మె నోటీస్ ఇచ్చి ఈరోజు సమ్మె ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు, ఎనిమిది నెలలుగా వేతనాలు పెండింగ్ లో ఉండడం వలన కుటుంబాలను పోషించడం కోసం ఆత్మాభిమానాన్ని చంపుకొని అప్పులు చేద్దామన్న ఇచ్చేవారు లేక దుర్భర జీవితాలను అనుభవిస్తూ రెగ్యులర్ గా విధులకు హాజరవుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేనియెడల అన్ని ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక,పెన్షనర్,ప్రజా సంఘాలను కలుపుకొని సమ్మెను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. **సమ్మె శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్..** సమ్మె శిబిరాన్ని హన్మకొండ జిల్లా కలెక్టర్ మేడం గారు సందర్శించి మీ పెండింగ్ వేతనాలు చెల్లించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులందరి అభిప్రాయం మేరకు ప్రభుత్వం పెండింగ్ వేతనాలు విడుదల చేసే వరకు సమ్మెను కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. ఈ సమ్మెలో యూనియన్ గౌరవాధ్యక్షులు జే సుధాకర్, అల్లం రమేష్,ప్రశాంత్, రాజకుమారి,రాము,కోమల, బరుపాటి యాకయ్య, ప్రకాష్,కవిత,బాబు,ఆరిఫా సుమంత్,రషీదా తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్సీ పదవులను బీసీలకే కేటాయించాలి

- కాంగ్రెస్ ఇద్దరికి, టిఆర్ఎస్ ఒక్కరికి ఇవ్వాలి
- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**హనుమకొండ, మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** త్వరలో ఎమ్మెల్యే కోటాలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చే మూడు ఎమ్మెల్సీ పదవుల్లో రెండు ఎమ్మెల్సీ పదవులను 'బీసీ"లకు కేటాయించాలని, బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఒక్క ఎమ్మెల్సీ స్థానాన్ని 'బీసీ"లకు కేటాయించి బీసీలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలను అన్ని పార్టీలు కేవలం ఓటు బ్యాంక్ గా వాడుకుంటూ పదవులు మాత్రం అగ్ర వర్ణాల వారికే కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు బీసీలలో చాలా చైతన్యం వచ్చిందని రాష్ట్రంలో బీసీ వాదం బలపడుతుందని 2028 లో రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రి అయ్యే విదంగా బీసీలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం

- అర్హులైన పోడు రైతులకు హక్కుపత్రాలు ఇవ్వాలి
- ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



**నర్సంపేట, మర్చి 07,( పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, పాలకుల ఎన్నికల హామీల అమలుకై, పోడు రైతులకు అటవీ హక్కుపత్రాలకై ప్రజా ఉద్యమాలే ఏకైక శరణ్యమని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. ఎంసీపీఐ(యు) ఖానాపురం మండలం అశోక్ నగర్ గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి కలకోట్ల యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పెద్దారపు రమేష్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్న పేద మధ్యతరగతి ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాకపోగా పెట్టుబడిదారుల కార్పొరేట్ శక్తుల ఆస్తులు వందల రెట్లు అధికంగా పెరిగాయని దేశ సంపద వనరులు దోచుకునే విధంగా పాలకులంతా అదే పనిలో ఉన్నారని ఆకలి దారిద్రం నిరుద్యోగం ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని దీనికి తోడు ప్రజల మత బలహీనతలను ఆసరా చేసుకొని విభజించు పాలించు అనే విధంగా దేశ సమైక్యత సమగ్రతను విచ్ఛిన్నం చేసే విధంగా మోడీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తుందని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదం అన్నారు. ఎన్నికల్లో గెలవడానికి ప్రజలను భ్రమలకు ఆశలకు గురిచేసి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి తమ ఇష్టానుసారంగా పాలన సాగిస్తున్నారని పోరాడే వ్యక్తులు శక్తులను అప్రజస్వామికంగా అణిచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి హింసను ప్రేరేపించుటకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితం పోడు వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న రైతులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారనిఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలకతీతంగా ప్రజలను చైతన్యపరిచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్నికల హామీల అమలు కోసం ఉద్యమించాల్సిన కర్తవ్యం ఎర్రజెండాపై ఉందని అందుకోసం కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలు గనపాక నర్సయ్య రాఘవరావు గోపాల్ లక్ష్మి యాకయ్య గంగాధర నర్సయ్య జి ఎల్లమ్మ రాజేందర్ రామా తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హనుమకొండ, మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 44 డివిజన్ పరిధిలోని కడిపికొండ ప్రాంతానికి చెందిన మాజీ బ్లాక్ అధ్యక్షులు నర్మేట వెంకటరమణ గౌడ్ తల్లి నర్మేట సరోజన మృతిచెందగా.., ఈ విషయం తెలుసుకొని శుక్రవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి వారి నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా 45వ డివిజన్ పరిధిలోని తరాలపల్లి గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్ర హరీష్ రెడ్డి బంధువు పుల్యాల కృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.., శుక్రవారం వారి వివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఐనవోలు మండల పరిధిలోని వనమాలకనపర్తి గ్రామంలో గత కొద్దిరోజుల క్రితం మరణించిన మాజీ డైరెక్టర్ మరకాల లక్ష్మి , రిషిక సుధాకర్ , గట్టు రాజేష్ గౌడ్, ల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. **2వ డివిజన్ లో పరామర్శ..** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ కాలనీకి చెందిన వ్యాస వెంకటయ్య నిన్న రాత్రి అనారోగ్యంతో మృతిచెందగా.., శుక్రవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు వారి నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వారి వెంట ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**చిట్యాల, మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల /కళాశాలలో, ( మోడల్ స్కూల్) ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం జరిగింది ఈ సందర్భంగా పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ మేకల రమేష్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు శాలువాలతో జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి సత్కరించారు మహిళా లేనిదే ఈ ప్రపంచంలో మనుగడ లేదని మానవాళి సృష్టికర్త మహిళ అని మహిళా అనేక రూపాలుగా అవతారాలు ఎత్తి మానవ మనుగడకు ఎంతో తోడ్పడుతుంది స్త్రీ అంటే ఆదిశక్తి పరాశక్తి దుర్గా శక్తి రూపాంతరాలు చెంది అమ్మగా ఈ సృష్టిని కాపాడుతుంది ప్రపంచాన్ని నడిపిస్తుంది కాబట్టి స్త్రీల పట్ల గౌరవంగా ఉండడం మర్యాదగా నడుచుకోవడం వారిని అన్ని రంగాలలో ఉండేందుకు సహకరించడం మన వంతు బాధ్యతగా చూసుకుందాం అని అన్నారు ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్. నీలం రవీందర్, రాజు.శివ. ధనలక్ష్మి.సమీరా ఆయేషా. జోష్ణ .ప్రసన్న.రాణి శ్రీలత. ఎండి కలీం పాషా. రామస్వామి.రాజు.భాస్కర్. సాగర్. శ్రీకాంత్. ఆర్ పి ఎండి షబిరుద్దీన్. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు

# మహిళలు అన్నిరంగాల్లో ఆకాశమే హద్దుగా ఎదగాలి

- ఎంచుకున్న లక్ష్యాలపై దృష్టి సారించాలి
- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్యకి ఘన స్వాగతం పలికిన విద్యార్థులు
- ఎన్ఎస్ఎస్సి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించిన ఎంపీ డా.కడియం కావ్య



**హనుమకొండ, మార్చి 7 (పీసీడబ్ల్యూ న్యూస్):** మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆకాశమే హద్దుగా ఎదగాలని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. శుక్రవారం హన్మకొండ లోని వడ్డేపల్లిలోని పింగళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ మహిళ దినోత్సవ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. విద్యతోనే మహిళా సాధికారిత సాధ్యమని ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. మహిళలంతా ఆర్థికంగా బలంగా మారడంతో పాటు సామాజిక, రాజకీయ రంగాల్లోనూ ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. ఉన్నత భవిష్యత్తు కోసం నిరంతరంగా సాధన చేసి అత్యుత్తమ ప్రగతిని సాధించాలని తెలిపారు. అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణించగలమని అతివలు రుజువు చేస్తున్నారని స్పష్టం చేశారు. ఇంటిని చక్కదిద్దడంలోనే కాదు..అంతరిక్షంలోనూ విహరిస్తున్నారని తెలిపారు. దేశ రక్షణలోనూ మేము సైతం అంటూ బాధ్యతలు తీసుకుని, విజయవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. క్రీడలు, వ్యవసాయం, వైద్యం, విద్య, రాజకీయం.. ఇలా ఏ రంగమైనా ఆకాశమేహద్దుగా మహిళలు దూసుకుపోతున్నారని తెలియజేసారు. యువత ఆకర్షణలతో పెడదోరణి పట్టి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని అన్నారు. ఎంచుకున్న లక్ష్యాలపై దృష్టి సారించి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. విద్యార్థులపై తల్లిదండ్రులు, గురువులు పెట్టుకొన్న ఆశలను నెరవేర్చాలని తెలిపారు. మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కడియం ఫౌండేషన్ ద్వారా విద్యార్థినిలకు శానిటరీ న్యాప్‌కిన్‌లు అందజేయడం జరిగిందని తెలిపారు. అలాగే గర్భిణిలకు న్యూట్రిషన్ కిట్స్ ను అందించామన్నారు. అనంతరం మహిళ దినోత్సవం సందర్భంగా ఎంపీ గారిని కళాశాల అధ్యాపకులు శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపల్ సుహాసిని, ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ సురేష్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ అరుణ ఇతర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసిన మున్సిపల్ కమిషనర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి మున్సిపాలిటీ కార్యాలయంలో ఎల్ ఆర్ ఎస్ హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ప్రసాద్ చౌహాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ముప్పై ఒకటో తేదీ వరకు ఎల్ ఆర్ ఎస్ ఫీజులో ఇరవై అయిదు శాతం రాయితీ ఉంది కావున ప్రజల ఈ అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ క్రమంలో ఎల్ ఆర్ ఎస్ పై ఏలాంటి సందేహాలు ఉన్నా మేము ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ లో పరిష్కరించుకోవాలని చెప్పారు.

# రేపు సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నమోదైన వివిధ రకాల, దీర్ఘకాలికంగా పరిష్కారం కానటువంటి కేసులను మార్చి ఎనిమిదవ తేదీన నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ ద్వార పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.సంగారెడ్డి, జోగిపెట్, జహీరాబాద్, నారాయణ్ ఖేడ్ స్థానిక కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీ మార్గం ద్వారా ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కేసులను పరిష్కరించుకోవాలని చెప్పారు. ఈ సదవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపితే జైలుకు వెళ్లక తప్పదు: ఎస్సై వెంకట రెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):**సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ ఎస్సై వెంకట్ రెడ్డి మట్లాడుతూ సిర్గాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైన మద్యం సేవించి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ప్రతీ రోజూ పెద్ద ఎత్తున నిర్వహిస్తామని చెప్పారు. ఒకవేళ ఎవరైన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో దొరికితే వారిపైనా చట్ట పరమైన చర్యలు తీసుకొని వాహనం సీజ్ చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారుఅలాగే అతి వేగంతో వాహనాలు నడపకూడదని చెప్పారు.

# ఆదర్శ పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా హత్నూర్ మండలంలో ఉన్న ఆదర్శ పాఠశాల లో దరఖాస్తులకు ఈ నెల పదో తారీఖు చివరి తేదీ ఉంది కావున విద్యార్థుల ఈ సదవకాశాన్ని వినియోగించు కోవాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరవ తరగతి లో వంద సీట్లకు, ఏడు నుండి పదవ తరగతి వరకు ఖాళీ ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసుకోవడానికి అన్ లైన్ లో https.//telanganams. cgg.gov.in అనే వెబ్ సైట్ సందర్శించి అప్లై చేయాలని చెప్పారు.

# మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హనుమకొండ, మార్చి 7 (పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ కూరగాయలు మార్కెట్ రోడ్డు వివేకానంద కాలనీకి చెందిన పులి నాగరాజు గౌడ్ అనారోగ్యంతో మృతి చెందగా.., ఈ విషయం తెలుసుకొని, శుక్రవారం మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వారి నివాసానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఎమ్మెల్యే వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్‌గా సన్ ప్రీత్ సింగ్



**హనుమకొండ, మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సన్ ప్రీత్ సింగ్ 2011ఐపిఎస్ బ్యాచ్ కు చెందినవారు. 2012 సంవత్సరంలో ములుగు ఏ. ఎస్పీ, వరంగల్ రూరల్ ఓ ఎస్ డి గా పని చేశారు. అనంతరం ఎల్.బి నగర్ డిసిపీ గాను, ఎస్పీగా జగిత్యాల్ లో పనిచేశారు. ప్రస్తుతం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రామగుండం పోలీస్ కమిషనర్ గా బదిలీ అయినారు.

## సంగారెడ్డి జిల్లాకి నూతన పోలీస్ బాస్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా ఎస్పీ గా విధులు నిర్వర్తిస్తున్న చెన్నూరి రూపేష్ నీ నార్కోటిక్స్ ఎస్పీ గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సి ఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కొత్త గూడెం జిల్లా ఓ ఎస్డి గ విధులు నిర్వహిస్తున్న పారితోష్ పంకజ్ ను సంగారెడ్డి జిల్లా ఎస్పీ గ నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే విధుల్లో చేరాలని సూచించారు.

## పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



**ఖానాపూరం మర్చి 07, (పీసీ డబ్ల్యూ న్యూస్):** ఖానాపూరం మండలలో గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాల గురించి వినతి పత్రం ఎంపిడిఓ కార్యాలయంలో యంపిడిఓ అందుబాటులో లేకపోతె సూపర్డెంట్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల అధ్యక్షుడు ఎస్కే ఉస్మాన్ భాష ఉపాధ్యక్షుడు వెంగళ శీను కార్యదర్శి బిక్షపతి వెంకటమ్మ ప్రసన్న పార్వతి సోమక్క నరసయ్య కవిత రమేష్ మోహన్ తదితరులు పాల్గొన్నారు

## మాకు జీతాలు రాలే.. సమస్యలు తీరలే..

**- మండల స్పెషల్ ఆఫీసర్‌కు జి.పి కార్మికుల విన్నపం**



**బయ్యారం,మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీ కార్మికులు వివిధ పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగుల వలె గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి కార్మికులకు జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని కార్మికులు అన్నారు. జనవరి1 నుండి కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని 2 నెలలు గడిచిన జీతాలు చెల్లించక పోవడంతో పాటు,మరికొన్ని సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికులు మారం.శ్రీనివాస్ రెడ్డి, ఏకాంబరం, లతీఫ్, అశోక్, ఆదిశేషులు,రాము,వర్ష, అశోక్,ఏకాంతం,విజయ్, హమీద్,వెంకన్న పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ మృతి

**బయ్యారం క్రైమ్, మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):**మండలంలోని గంధంపల్లి పంచాయతీ పరిధిలో ఆటో డ్రైవర్ జలగం అన్వేష్(33) సంవత్సరాలు ,గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ రవికుమార్ శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం గత కొంత కాలంగా మృతుడు మద్యానికి బానిసై,తరచూ భార్యా,భర్తల మధ్య కలహాలతో మనస్థాపానికి గురిచెంది మృతి చెందినట్లు తెలిపారు. గురువారం మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## RFCL యాజమాన్యం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- కార్మిక సంఘాలకు కార్మిక సమస్యలపై చర్చించే అవకాశం ఇవ్వాలి..
- RFCL TUCI రాష్ట్ర నాయకులు తోకల రమేష్.




**రామగుండం,మార్చి07(పీసీడబ్ల్యూ న్యూస్):** RFCLలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ మూలంగా అధికారులు పెట్టిన టార్గెట్కు మించి యూరియా ఉత్పత్తి కొనసాగుతున్నది. కానీ కాంట్రాక్ట్ కార్మికుల శ్రవణ మాత్రం యాజమాన్యం గుర్తించడం లేదు. ఎంతగానో పోరాడి సాధించుకున్న ఈ పరిశ్రమ మూలంగా ఏమాత్రం ఇక్కడ నిరుద్యోగ యువత కు ఇక్కడి ప్రాంత నిర్వాసితులకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదు. ఇప్పటివరకు యాజమాన్యం సి ఎస్ ఆర్ ఫండ్స్ తో ప్రభావిత గ్రామాలను ఏమాత్రం అభివృద్ధి మొదలు పెట్టలేదు. పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు కాకపోయినప్పటికీ కార్మిక చట్టాలు అమలుకు నోచుకోకపోయినప్పటికీ యాజమాన్యం మాత్రం పట్టించుకోవడం లేదు. విదిలేని పరిస్థితుల్లో ఒక యూనియన్ సమ్మె నోటీస్ ఇస్తే, మేమే పరిష్కరిస్తామంటూ మరొక యూనిట్ ముందుకు వస్తుంటే యాజమాన్యం మాత్రం ప్రేక్షక పాత్ర వహిస్తున్నది. ఆర్ ఎఫ్ సి ఎల్ లో కాంట్రాక్ట్ కార్మిక సమస్యలు పరిష్కరిస్తే సమ్మె అవసరం కూడా సమస్యల పరిష్కరించాలని ప్రభుత్వానికి యాజమాన్యానికి ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా విజ్ఞప్తి చేస్తున్నది. కార్మిక చట్టాలను అమలు చేయాలని. కార్మిక సంఘాలకు కాంట్రాక్టు కార్మిక సమస్యలపై చర్చించే అవకాశం స్వేచ్ఛను కల్పించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నాం.

## భిక్షాటన చెసే అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించిన MDR ఫౌండేషన్

- ఆర్థిక సహకారం అందించిన ప్రతి రాజు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు పట్టణం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ సమీపంలో బుధవారం రాత్రి ఒక వృద్ధురాలు కింద పడి ఉండటం చూసి గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మరియు 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా వృద్ధురాలు చనిపోయిందని నిర్ధారించారు. తదనంతరం ఎమ్ డి ఆర్ ఫౌండేషన్ సభ్యుల సహకారంతో వృద్ధురాలిని అంబులెన్స్ లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వృద్ధురాలికి సంబంధించి కొడుకు వున్నా కూడా ఎటువంటి ఆర్థిక స్తోమత లేకపోవడంతో బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు అని తెలుపడంతో,ఎమ్ డి ఆర్ ఫౌండేషన్ అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు ఫౌండేషన్ కో-ఫౌండర్ పృథ్వీరాజ్ ఆర్థిక సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్ డి ఆర్ ఫౌండేషన్ సభ్యుల మధు తన చేతుల మీదుగా నిర్వహించారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చర్యలు చేపట్టాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**హనుమకొండ, మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులలో వాటికి పేమెంట్ జరిగి ప్రక్రియ పూర్తయ్యే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ల ప్రక్రియ పై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి లతో కలిసి మున్సిపల్, కుడా, జిల్లా పంచాయతీ, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్, కుడా, జిల్లా పంచాయతీ శాఖల లో ఇప్పటి వరకూ పెండింగ్ లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పెండింగ్ కారణాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ఎన్ని బృందాలను ఏర్పాటు చేశారని, దరఖాస్తుల పరిశీలనలో ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని వార్డు కార్యాలయాలలో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలన్నారు. హెల్ప్ డెస్క్ ల ద్వారా ఎల్ఆర్ఎస్ పేమెంట్ పై ప్రచారం జరగాలన్నారు. కుడా పరిధిలో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఎంపీవోలు చర్యలు చేపట్టాలని, పేమెంట్ జరిగిన రెండు రోజుల్లో ఎల్ -1 దశ నుండి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్ లో లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లాలో తాగునీటి సరఫరాపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా లోని గ్రామాలు, ఆవాసాలు సరిపోను తాగునీరు అందుతుందా అని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్, పరకాల మున్సిపల్ తో పాటు గ్రామాలు ఆవాసాల్లో తాగునీరు సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. ఈ వేసవిలో రానున్న రెండు మూడు నెలల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన ప్రణాళికలతో నీటి సరఫరా చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ, మల్లేశం, కుడా పిఓ అజిత్ రెడ్డి, సిపిఓ రవీందర్ రడేకర్, డీఎల్పిఓ గంగ భవాని, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టీ-పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని కలిసిన మొహమ్మద్ రహమతుల్లా



**హనుమకొండ, మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాజీపేట కు చెందిన మహమ్మద్ రహమతుల్లా గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో టీ-పిసిసి ఉమ్మడి వరంగల్ జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గా, ఎన్ఎస్ యుఐ విద్యార్థి నాయకుడిగా, సోషల్ మీడియాలో జిల్లా స్థాయి నుండి జాతీయస్థాయి వరకు కో-ఆర్డినేటర్ గా పనిచేసి ఐదు రాష్ట్రాల కర్ణాటక, ముంబై, ఒడిస్సా, తమిళనాడు ఆంధ్రప్రదేశ్ ఇన్చార్జిగా తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ గా క్రియాశీలకంగా సేవలందించానని, తనను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం లో రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి అవకాశం ఇవ్వాలని టీ-పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. ఈ సందర్భంగా టీ-పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించి రాష్ట్రస్థాయిలో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని మొహమ్మద్ రహమతుల్లా పేర్కొన్నారు.

## బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి: కలెక్టర్ ప్రావీణ్య








**హనుమకొండ, మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. శుక్రవారం వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని హనుమకొండ జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సునీతలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి కలెక్టర్ ప్రావీణ్య, డాక్టర్ రాంకుమార్ రెడ్డి, సునీత పూలమాల వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అమ్మాయిలు పట్టుదలతో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. బాలికలు ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందుకు సాగాలన్నారు. విద్యార్థినుల చదువులు, ఉద్యోగాల్లోనూ ముందు నిలవాలన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ఢిల్లీకి వెళ్లి సివిల్స్ కోచింగ్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉన్నత సేవలు అందించే వృత్తులలో నర్సింగ్ ఒకటని, క్లిష్ట పరిస్థితుల్లోనూ సేవలందించడంలో నర్సుల సేవలు ఎంతో ప్రాముఖ్యమైన వని అన్నారు. మహిళా దినోత్సవం నేపథ్యంలో కళాశాల విద్యార్థినులు అద్భుతంగా నృత్యాలు చేశారని, మహిళా దినోత్సవ ఏర్పాట్లు చాలా బాగున్నాయని అన్నారు. కేఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు శక్తిమంతులు, ధైర్యవంతులు అని అన్నారు. మహిళలు ఎంతోమంది ప్రపంచ వ్యాప్తంగా భిన్న రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని అన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సునీత మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు వివిధ రంగాలలో రాణిస్తూ ప్రథమ స్థానంలో నిలుస్తున్నారని అన్నారు. విద్యార్థినులు ఉన్నత స్థానం సాధించాలని ఆకాంక్షించారు. మహిళా దినోత్సవ నేపథ్యంలో కళాశాల విద్యార్థినులు స్పందిస్తూ తమ తల్లినే స్ఫూర్తి అని పేర్కొన్నారు. తాము జీవితంలో లక్ష్యం చేరేందుకు తల్లి ప్రోత్సాహంతో ముందుకు సాగేలా స్ఫూర్తి నిస్తుందన్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. మహిళా దినోత్సవం నేపథ్యంలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు మహిళల గొప్పదనం తెలియజేస్తూ ప్రదర్శించిన నృత్యాలు కేరింతలు పెట్టించాయి.నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## నేను ఎవరిపై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదు

- ఫ్యాబ్రికేటెడ్ వీడియోలతో నా పైదుష్ప్రచారం అర్ధరహితం
- జర్నలిజానికి మచ్చ తెచ్చేలా వ్యవహరించొద్దు
- ప్యారా నగర్ డంపు యార్డు విషయంలో ప్రజలకు సంపూర్ణ మద్దతు
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** ఫ్యాబ్రికేటెడ్ వీడియోలతో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గుమ్మడిదల ప్యారా నగర్ డంపు యార్డు విషయంలో స్థానిక జేఏసీ నాయకులతో జరిగిన సమావేశంలో తాను కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఒక వీడియో వైరల్ కావడం పై ఆయన స్పందించారు. డంపు యార్డు విషయంలో జేఏసీ నాయకులతో మాట్లాడుతూ. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గుమ్మడిదల ప్రజలకు సంపూర్ణ మద్దతు అందిస్తున్నారని వారికి సూచించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో తాను కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఒక వీడియోను సృష్టించి కొన్ని యూట్యూబ్ ఛానల్స్ ప్రచారం చేయడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన వివరణతో పాటు కనీసం అందులో పాల్గొన్న వారి వివరణ తీసుకోకుండా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా వార్తలు ప్రసారం చేయడం సరి కాదని తెలిపారు. ఏ అంశంపై నైనా కుండబద్దలు కొట్టినట్లు మొహమాటం లేకుండా తన అభిప్రాయాన్ని చెప్పడం అందరికీ తెలిసిన విషయమేనని. ఇలాంటి ఫ్యాబ్రికేటెడ్ వీడియోలను ప్రసారం చేస్తే ప్రజల్లో జర్నలిజంపై నమ్మకం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై న్యాయపరంగా ముందుకు వెళ్తామని తెలిపారు.



# విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి చేరాలి

**• భూపాలపల్లి పౌర సంబంధాల శాఖ అధికారి శీలం శ్రీనివాసరావు • తల్లి శీలం సరస్వతి జ్ఞాపకార్థం 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్, పెన్నుల పంపిణీ చేసిన డిపిఆర్ఓ శ్రీనివాసరావు**



**ఖమ్మం, మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** చదువు ద్వారానే సమాజంలో గౌరవం పెరుగుతుందని, విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి చేరాలని భూపాలపల్లి జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి శీలం శ్రీనివాసరావు అన్నారు. ఖమ్మం జిల్లా, కల్లూరు స్థానికుడైన శీలం శ్రీనివాసరావు ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా పౌర సంబంధాల అధికారిగా పనిచేస్తున్నారు. శుక్రవారం తన తల్లి శీలం సరస్వతి జ్ఞాపకార్థంతో పాటు తాను చదువుకున్న బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పేరువంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు 10వ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులందరికీ పరీక్షా ప్యాడ్స్, పెన్నులు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా శీలం శ్రీనివాసరావు మాట్లాడుతూ... ప్రతి విద్యార్థికి గోల్ ఉండాలని, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పినట్లు కలలు కనండి వాటిని సాకారం చేసుకోవడంకోసం కృషి చేయాలని సూచించిన ప్రకారం ప్రతి విద్యార్థి తన లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. సమాజంలో చదువే మనిషికి గౌరవాన్ని తెచ్చిపెడుతోందన్నారు.తన తల్లిదండ్రులు కూలిపనులు చేసి తనను ఎంతో గొప్పగా చదివించారని, అలా చదువుకోవడం వల్లనే నేడు జిల్లా అధికారిని అయ్యానని అన్నారు. ప్రతిఒక్కరు తల్లితండ్రులును, గురువులను, సమాజాన్ని గౌరవించి మంచి విద్యార్థులుగా ఎదగాలని, తద్వారా మన సమాజానికి సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పేరువంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్కే మౌలాలి మాట్లాడుతూ... విద్యార్థి ప్రగతికి 10వ తరగతి తొలి పట్టా అని, విద్య మాత్రమే మనిషిని ఉన్నత స్థాయికి చేర్చగలదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు యాలాద్రి, రాము, వరక రామారావు, ఉబ్బన బాబురావు, జల్దీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాములోరి తీరు కళ్యాణానికి కోటి-గోటి తళంబ్రాల కార్యక్రమం

**• పాల్గొన్న బయ్యారం,గూడూరు తహసీల్దార్లు**





**బయ్యారం,మార్చి 7,(పిసిడబ్ల్యూ న్యూస్):** భద్రాద్రి రాముని కళ్యాణ మహోత్సవానికి ప్రతి ఏటా గోటి తలంబ్రాలు తయారుచేయుటకు శ్రీరామభక్తులు సర్వసన్నదమై భక్తిశ్రద్ధలతో తలంబ్రాలను తయారుచేస్తారు.దానిలో భాగంగా మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కోటి–గోటి తళంబ్రాల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బయ్యారం మండల తహసీల్దార్ బి.విజయ, గూడూరు తాసిల్దార్ శ్వేత పాల్గొని శ్రీ సీతారామచంద్ర స్వామి దర్శనం చేసుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం భక్తులందరితో కలిసి స్వామి వారి తళంబ్రాలు వలిచారు. అనంతరం తహసీల్దార్ లు విజయను,శ్వేత లకు ఆలయ కమిటీ తరపున శాలువాతో ఘనంగా సత్కరించారు. వడ్లను గోటితో వలిచి తలంబ్రాలను శుద్ధకరణతో శ్రీరామ, జయరామ,నామ స్మరణ జపం చేస్తూ తయారు చేయాలని కమిటీ వారు రామ భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పూజారి సుదర్శన్ చార్యులు మహిళలు మాధవి, పూర్ణిమ,శారద,సరిత,ఉషారాణి,శ్రావణి,అనూష,శైలజ తదితరులు పాల్గొన్నారు.

# లార్వా నిర్మూలనకు డ్రోన్ సహాయంతో పిచికారీ



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,మార్చి 7,(పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా డివిజన్ పరిధిలో పెద్ద మొత్తంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి అందులో మస్కిటో లార్వా వృద్ధి చెందకుండా డ్రోన్ సహాయంతో పిచికారి చేయడంతో పాటు మురుగునీరు నిల్వలో ఆయిల్ బాల్స్ ను శుక్రవారం వేయించడం జరిగింది.సాకేత్ కాలనీలోని పార్క్ రెసిడెన్సి తోపాటు గోకుల్ రెసిడెన్సి అపార్ట్ మెంట్ పక్కన గల మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతంలో (సుమారు ఎకరం ప్రాంతంలో),కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజు శివమణి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దోమ లార్వా నిర్మూలనలో భాగంగా జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోనల్ కమీషనర్ హేమంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ జగన్,కాప్రా సర్కిల్ అసిస్టెంట్ ఎంటామాలజిస్ట్ డి. రమేష్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ ఆయిల్ బాల్స్ వల్ల ఆయిల్ మొత్తం నీటి పైన ఒక పోరా లాగా ఏర్పడి నీటిలో గల లార్వాకు ఆక్సిజన్ అందకుండా చేస్తుందన్నారు.ఆక్సిజన్ అందకపోవడంతో లార్వా చనిపోతుందన్నారు.దీనివల్ల దోమల బెడద తగ్గి,దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల బారిన పడకుండా ఉండ వచ్చునన్నారు.దీనితో పాటుగా డ్రోన్ సహాయంతో నీటి నిలువ ఉన్న మధ్య ప్రాంతం (మలేరియా సిబ్బంది వెళ్ల లేని ప్రదేశం)లో డ్రోన్ సహాయంతో స్ప్రే చేసారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్,అపార్ట్ మెంట్ వాసులు వినోద్,ప్రసాద్, శ్రీనివాస్,బివి శర్మ,ఇంచార్జ్ ఈఎఫ్ఏ అనిల్,ఎంటమాలజి సిబ్బంది పాల్గొని,దోమలపై వాటి వలన వ్యాపించి వ్యాధులపై అవగాహన కార్యక్రమాలను చేపట్టారు.



# సమాజంలో ప్రతి ఒక్కరు మహిళా సాధికారతకు తోడ్పడాలి

**• మహిళలు ఎదిగితే సమాజం అభివృద్ధి చెందుతుంది**

**• మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి**

**• జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



**మహబూబాద్ జిల్లా మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవవేడుకలు జరిగాయి,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మహిళా దినోత్సవం ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, మాట్లాడుతూ మహిళలు విద్య, ఉపాధి రంగాల్లో లింగ సమానత్వం, మహిళా సాధికారత, సాధించాలనీ, మహిళల హక్కులను కాపాడడం సామాజిక, సాంకేతిక రంగాల్లో పురోగతిని ప్రోత్సహించాలని,విద్య ఉపాధి భద్రత వంటి రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా మహిళలు ముందుంటారని, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక స్వావలంబన, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.ఒక మహిళ విజయవంతురాలు అయితే కుటుంబంతో పాటు సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని, మహిళల మేధాశక్తి చాలా గొప్పదన్నారు.అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి,లు మాట్లాడుతూ సమాజం,కుటుంబంనిజమైన అభివృద్ధి చెందాలంటే మహిళల చేతుల్లోనే ఉంటుందని అన్నారు, కృత్రిమ మేధస్సు, డిజిటల్ రంగాలలో మరింత ప్రోత్సాహం అవసరమని అన్నారు, వేడుకలకు హాజరైన డిఎంహెచ్వో డాక్టర్ మురళీధర్, సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ నాగవాణి, డి ఎ వో విజయనిర్మల, జిల్లా వెల్ఫేర్ అధికారిని ధనమ్మ, షీ టీమ్స్ సబ్ ఇన్స్పెక్టర్ సునంద, సిడబ్ల్యుసి మెంబర్ పి.అశోక్, జయశ్రీ, లక్ష్మి, సిడిపిఓలు శిరీష, నిలోఫర్, ఎల్లమ్మ, కమలాదేవి,తదితరులు మహిళా సాధికారత అభివృద్ధిపై మాట్లాడారు, ఈ కార్యక్రమంలో ఉపన్యాసాలు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ప్రదర్శన, మహిళ ఉత్తమ ఉద్యోగులకు బహుమతుల ప్రధానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించగలరు

**• గురుకుల డిగ్రీ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ యం. సునీత, సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి • గురుకుల డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం • కళాశాలలో రోజువారీ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న మహిళలకు శాలువాలతో ఘన సన్మానం**



**ఖమ్మం, మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** మహిళలు అన్ని రంగాలలో రాణించగలరని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ యం. సునీత, సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి లు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కొన్ని సంవత్సరాలుగా రోజువారీ కూలీలుగా, పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న పేద మహిళలను శాలువాలతో ఘనంగా సత్కరించి మహిళలంతా సమానులే అని చాటి చెప్పారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థినులు ఎంతో అలరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు గొప్ప గొప్ప విజయాలు సాధించినటువంటి సావిత్రిబాయి పూలే, రమాబాయి అంబేద్కర్, మదర్ థెరిస్సా, ఝాన్సీ రుద్రమదేవి, చాకలి ఐలమ్మ ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము తదితర మహిళల విజయాల గురించి గొప్పగా తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ... ఎన్ని కష్టాలు ఎదురైనా ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కళాశాలలో కోలాహలంగా మహిళా దినోత్సవ వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# నేడే జాతీయ లోక్ అదాలత్

**• జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి**

**• రవీంద్రశర్మ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి**

**• సురేష్ సెక్రెటరీ జిల్లా న్యాయసేవాధికార సంస్థ మహబూబాబాద్**




**మహబూబాబాద్ (న్యాయ సేవ), మార్చి7(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశవ్యాప్తంగా పెద్దఎత్తున జరిగే జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా శనివారం 08-03-2025 రోజున మహబూబాబాద్ జిల్లా కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ అదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాసేవాధికార సంస్థకు సెక్రటరీ సురేష్ ,జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు మరియు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో వేల సంఖ్యలో కేసులు పెండింగ్ లో ఉన్నాయని,అన్ని కేసులను సాధారణ పద్దతిలో పరిష్కరించడం సాధ్యం కాదని జాతీయ లోక్ అదాలత్ ను వినియోగించుకుని రాజీపడగలిగే క్రిమినల్, సివిల్ భూ తగాదా, మోటార్ వాహన ప్రమాదం, వివాహ, కుటుంబ తగాదా కేసులు, బ్యాంకు, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, విద్యుత్ చోరీ (దొంగతనాలు), ట్రాఫిక్, ఈ చలాన్ కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కక్షిదారులు తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టుల్లో తెలియజేసి రాజీ కుదుర్చుకుని కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, మహబూబాబాద్ డి.ఎస్.పి తిరుపతిరావు, జిల్లా కోర్టు పరిపాలనాధికారి క్రాంతి కుమార్, స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్లు దేవేందర్, సర్వయ్య, రాజేష్, రవి కుమార్ మరియు కోర్ట్ కానిస్టేబుల్స్ హాజరయ్యారు.

# టీబీ రికార్డులను పరిశీలించిన డా. సారంగం.



**బయ్యారం,మార్చి7(పిసిడబ్ల్యూ న్యూస్):** టీబీ ముక్త్ భారత్ పంచాయత్ వెరిఫికేషన్ లో భాగంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. మురళీధర్ ఆదేశానుసారం మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సారంగం బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చర్లపల్లి గ్రామ పంచాయతీలో టీబీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి మాట్లాడుతూ గత సంవత్సరంలో నమోదయిన కేసుల వివరాలను తనిఖీ చేసి గ్రామపంచాయతీ పరిధిలో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడంతో గ్రామ పంచాయతీ ని టీబి రహిత గ్రామ పంచాయతీగా గుర్తింపు కొరకు నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాగర్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి రాజు, కోఆర్డినేటర్ అశోక్, సూపర్వైజర్ జయరాం, నోడల్ పర్సన్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కోటంచ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు....



**రేగొండ, 07(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** తేది. 07-03-2025 శుక్రవారం రోజున శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానము, కొడవటంచ గ్రామము, మండలం రేగొండ, జిల్లా జయశంకర్ భూపాలపల్లి నందు 2025 – సంవత్సరం జాతర, బ్రహ్మోత్సవములు తేది. 09.03.2025 నుండి తేది. 16.03.2025 వరకు జరుగు సందర్భంగా జాతరకు గౌరవ భూపాలపల్లి శాసన సభ్యులు శ్రీ గండ్ర సత్య నారాయణ రావు ను ఆలయ కార్యనిర్వహణాధికారి, ఆలయ చైర్మన్. శ్రీ స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదములు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆహ్వాన పత్రిక ఇచ్చి ఆహ్వానించారు.

# నేడు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్ రాక

**- హనుమకొండ కాళోజి కళాక్షేత్రంలో జాతీయ లోక్ అదాలత్, సామాజిక కార్యక్రమం**

**హనుమకొండ, మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** ( నేషనల్ లోక్ అదాలత్ అండ్ కమ్యూనిటీ మీడియేషన్ ప్రోగ్రాం)ను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ సుజోయ్ పాల్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమా దేశ్ పాండే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాళో జీ కళాక్షేత్రంలో నిర్వహించే ఈ కార్యక్రమం నేడు(శనివారం) ఉదయం 9:30 ప్రారంభం అవుతుందన్నారు. భాగంగా సామాజిక మధ్యవర్తిత్వ వాలంటీర్లతో రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ సమావేశమవుతారని జస్టిస్ క్షమా దేశ్ పాండే పేర్కొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్

**జగిత్యాల, మర్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించి తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవాలని జగిత్యాల తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ సూచించారు. జిల్లా కేంద్రంలో ధన్వంతరి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ,అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజునే కాకుండా ప్రతీ రోజు మహిళలు వారి అభివృద్ధిని గుర్తు చేసుకోవాలని అన్నారు. మహిళలు తలుచుకుంటే కానిదేది లేదని, ప్రతీ మహిళ సమాజాన్ని నడిపించే శక్తిగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు, పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఓటర్లలో మార్పు వచ్చింది...

### - ప్రలోభాలకి లొంగకుండా ఓటు వేశారు

### - విజయ్ కుమార్ నారమళ్ళ జర్నలిస్ట్



**కరీంనగర్,మార్చ్07(పీసీడబ్ల్యూ న్యూస్):** బరిలో హిమాహిమీలు, డబ్బుల పంపిణీ, ఏరులై పారిన మద్యం, ఉత్కంఠ ఫలితాలు, నాలుగు ఉమ్మడి జిల్లాల్లో, జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు, వాటి ఫలితాలు ఎలా ఉన్నా, గెలుపు ఎవరిని వరించినా, అందరి దృష్టిని ఆకర్షించిన బహుజన బిడ్డ, ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ, అతి స్వల్ప తేడాతో విజయం సాధించలేకపోయారు, అనే మాట కంటే నైతికంగా విజయం సాధించిన వ్యక్తి ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించిన వ్యక్తి, తన ప్రొఫెసర్ పదవికి రాజీనామా చేసి, ప్రజాసేవ చేద్దామని ఎన్నికల్లో పోటీ చేశారు, ఇంకోవైపు ,అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి, మరోకరు బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి, అంగ బలం, ఆర్థిక బలం ఉన్న వీరిద్దరితో సమానంగా పోటీ పడ్డాడు..ఒక్క పైసా పంచకుండా, గెలిస్తే నిరుద్యోగులకు తను ఏం చేస్తాడో మాత్రమే చెప్తూ, ప్రచారం నిర్వహించారు, బీసీ నినాదంతో, తన విద్యార్థులను, పట్టభద్రులను, నమ్ముకుని పోటీ చేశారు, అరవై వేల పైచిలుకు ఓట్లను సాధించుకోగలిగారు, ఐదు నెలల క్రితం ప్రసన్న హరికృష్ణ అంటే ఎవరికి తెలియదు, ఇప్పుడు నాలుగు ఉమ్మడి జిల్లాల్లో, ప్రతి విద్యావంతుడికి తెలిసిన పేరు, ఫలితాలు ఎలా ఉన్నా, పట్టభద్రుల, ప్రజల పక్షాన, సమస్యల కోసం పోరాడుతానని అంటున్నారు, నోటుకు ఓటు, అసత్యమని, ఓటర్లలో నిజాయితీపరులు ఉన్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో తేలిందని, ఓటమిని చిరునవ్వుతో స్వాగతిస్తూ, కన్నీరు పెట్టకుండా హుందాగా వ్యవహరించిన ప్రసన్న హరికృష్ణ, రాబోయే రోజుల్లో మన రాష్ట్రానికి ఒక మంచి నాయకుడు అవుతాడని, పట్టబదులు ఆశాభావం వ్యక్తపరిచారు.

# విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళలు

**● సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు ధైర్యంగా పోరాడాలి ● వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బి. నిర్మల గీతాంబ**





**హనుమకొండ, మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** ముందు తరాలతో పోల్చుకుంటే ప్రస్తుత తరంలో మహిళలు విభిన్న రంగాల్లో ముందు వరుసలో నిలుస్తున్నారని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బి. నిర్మల గీతాంబ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మల గీతాంబ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలు వెనుకబడి లేరని, అన్ని రంగాల్లో ముందు నిలుస్తున్నారని అన్నారు. ముందు తరాలతో పోల్చుకుంటే విభిన్న రంగాల్లో ముందున్నామన్నారు. కలెక్టర్లు, పోలీస్, తదితర ఎన్నో ఉద్యోగాలు మొదలుకొని ఆకాశం వరకు మహిళలు ఎన్నో అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందు నిలుస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఎందులోనూ తీసుపోలేరని, ఉద్యోగాలు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, అందుకు కలెక్టర్లు, తదితర ఎంతోమంది ఉద్యోగులే నిదర్శనం అని అన్నారు. ఒకరికొకరు గౌరవించుకున్నప్పుడే సమాజం ఎంతో ముందుకు వెళ్తుందన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు ధైర్యంగా పోరాడాలన్నారు. మహిళలు జీవిత మార్గంలో లక్ష్యాన్ని కష్టపడి సాధించాలన్నారు. మనం కష్టపడి సాధించిన ప్రగతి ప్రస్థానాన్ని నెమరు వేసుకున్నప్పుడు ఎంతో సంతోషంవేస్తుందన్నారు. విభిన్న రంగాలలో రాణిస్తున్న మహిళలు మరెంతో మంది మహిళలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఎన్నో అవరోధాలను దాటి ఉన్నత స్థానంలో నిలిచినందుకు మహిళా అధికారులు ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యమాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి మహిళా ఒక రోల్ మోడల్ అని పేర్కొన్నారు. సమాజంలో పురుషులే మహిళా దినోత్సవం నిర్వహించినప్పుడే అసలైన మహిళా దినోత్సవం అని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులను ప్రోత్సహించి నప్పుడు మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారని అన్నారు. భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్, కల్చరల్ పోటీలలో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. ఈ సందర్భంగా మహిళా అధికారులు, ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో, కుటుంబ వ్యవస్థలో మహిళలే కీలకమని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని అన్నారు. సమాజంలో స్త్రీల పట్ల వివక్షను రూపుమాపే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అన్ని రంగాలలో మహిళలను ప్రోత్సహించాలన్నారు. టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ వరంగల్ జిల్లాల మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. వివిధ పోటీలలో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. వివిధ బాధ్యతలలో ఎంతో ఒత్తిడి ఉండే మహిళా ఉద్యోగులు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా మరింత ఉత్సాహన్ని కలగజేస్తాయన్నారు . తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ లో కీలక బాధ్యతల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మల గీతాంబ, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ను శాలువాలు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళా ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, మహిళా అధికారులు నీరజ, అనురాధ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల అనుమతి లేకున్నా హంగామా...

**● గ్రామంలో వెలసిన ఫ్లెక్సీలు...**

**● నిద్రపోతున్న అధికారులు?...**



**రామడుగు, మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి నిబంధనలకు విరుద్ధంగా డెవలప్మెంట్ పేరుతో ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు.. వివరాలలోకి వెళితే రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామంలో 63,64,సర్వేనెంబర్ లలో డబల్ బెడ్ రూమ్ పక్కన ఉన్న స్థలంలో ఆరు ఎకరాల వ్యవసాయ భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు.. గత కొద్ది రోజుల నుండి ఈ స్థలంలో సుచిత్ర డెవలప్మెంట్ పేరుతో అంతర్గత రోడ్లు డ్రైనేజీలను నిర్మిస్తున్నారు.. నిబంధనల ప్రకారం లేఅవుట్ చేసిన స్థలంలో గ్రామపంచాయతీకి 10% రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. ఈ స్థలం లేఅవుట్ విషయమై గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ ను వివరణ కోరగా ఈ స్థలానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు డిటిడిసి నుండి అనుమతులు మాత్రం తీసుకున్నారని గ్రామ పంచాయతీ 10 శాతం కూడా రిజిస్ట్రేషన్ చేయించారని అన్నారు.. మరి గ్రామపంచాయతీ అనుమతి పత్రం ఇచ్చారా అని వివరణ కోరగా డిడి మాత్రం చెల్లించామని ఆన్లైన్లో దరఖాస్తు చేస్తే ఆన్లైన్ మాత్రం కావటం లేదని వివరణ ఇచ్చారు.. గ్రామంలో ప్రధాన రహదారుల వెంట సుచిత్ర డెవలప్మెంట్ పేరుతో అక్కడక్కడ ఫ్లెక్సీలు వెలిశాయి.. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అక్రమంగా ప్లాట్లు సామాన్య ప్రజలకువిక్రయిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు సంపాదన ధ్యేయంగా ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.. ఇంత తతంగం జరుగుతున్న గ్రామపంచాయతీ నుండి అనుమతి పత్రం లేకున్నా మండల ప్రత్యేక అధికారి గ్రామ కార్యదర్శి మౌనంగా ఉండడం వెనుక అంతర్యం ఏమిటని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.. మరి ఇప్పటికైనా అక్రమంగా విక్రయిస్తున్న ప్లాట్ల విక్రయాల వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకుంటారా లేదో చూద్దాం.



## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు 25 శాతం రిబేటును సద్వినియోగం చేసుకోండి

**● జిల్లాలో 44వేల437 దరఖాస్తులకు ఫీజు నిర్ణయించబడింది ● ఈ నెల 31 వరకు మాత్రమే గడువు ఉంది ● దరఖాస్తు దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి ● క్రమబద్ధీకరించుకోని వారికి భవిష్యత్తులో -పర్మిషన్లురావు,రిజిస్ట్రేషన్లు కూడా కావు ● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ● అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ వెల్లడి**




**కరీంనగర్,మార్చ్07(పీసీడబ్ల్యూ న్యూస్):** ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ నెల 31 లోపు ఆన్లైన్ లో ఫీజు చెల్లించినట్లయితే 25 శాతం రిబేటు లభిస్తుందని అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ తో కలిసి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.సుడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దరఖాస్తు దారులు ఎల్ఆర్ఎస్ 2020 వెబ్ సైట్ లోకి వెళ్లి పరిశీలించినట్లయితే వారియొక్క దరఖాస్తు కు సంబంధించి ఫీజు వివరాలు తెలుస్తాయని జిల్లాలోని కార్పోరేషన్,సుడా మరియు మున్సిపాలిటీలు అన్నీ కలిపి 44 వేల437 దరఖాస్తులకు ఫీజు నిర్ణయించబడిందని తెలిపారు. ఫీజు నిర్ణయించబడని 1435 దరఖాస్తులు ప్రోహిబిటెడ్ లో లేనట్లయితే మళ్లీ ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకుంటే తిరిగి పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.పది శాతం ప్లాట్లు అమ్మిన వెంచర్స్ కు కూడా మిగితా ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ కట్టుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని అన్నారు.ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎల్ఆర్ఎస్ లేని ప్లాట్లకు భవిష్యత్తులో ఎలాంటి అనుమతులు కానీ రిజిస్ట్రేషన్ లు కానీ కావని పేర్కొన్నారు. దరఖాస్తు దారులకు ఏవైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్లు 9652404978 మరియు 7093750333 కు ఫోన్ చేయవచ్చు అని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపివో ఆంజనేయులు,ఫీల్డ్ ఆఫీసర్లు అజయ్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ధన్వంతరి ఆలయంలో కుంకుమ పూజలు



**జగిత్యాల, మర్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయం నందు వెలసి యున్న మాతా ధన లక్ష్మిదేవి సేవలో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి వారి అధ్వర్యంలో శుక్రవారం కుంకు మార్చన లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేసారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ధార ఒకర్ని సెలెక్ట్ చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రంతో ఆలయ పూజారి అధ్వర్యంలో ఆశీర్వచన ములతో సత్కరించడము జరుగుతు ంది. ప్రతి శుక్రవారం అమ్మవారి ప్రసాధంగా మాతలకు సమర్పించ బడును. ప్రతి శుక్రవారం సూర్య ధన్వంతరి దేవాలయములో కుంకుమ పూజలు జరుగు చుండును. దీనికి ఎలాంటి రుసుము లేదు. కావలసిన పూజ సామాగ్రి దేవస్థానం వారు సమకూర్చ గలరు. మరియు రవాణా సౌకర్యం కలదు. అధిక సంఖ్యలో భక్తులు మహిళా మణులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయ గలరు. ఈ కార్యక్రమము నందు దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్. డాక్టర్. వడ్లగట్ట రాజన అద్యక్షులు. పాల్తెపు శంకర్ ప్రధాన కార్యదర్శి. వడ్లగట్ట శంకర్ ఆలయ పర్యవేక్షకులు, గట్టు రాజేందర్. ఆర్గనైజింగ్ సెక్రెటరి వొడ్నాల శ్రీనివాస్ ఆలయ అర్చకులు చిలుకముక్కు నాగరాజు మరియు మహిళా సమితి సభ్యులు వొడ్నాల లత, వడ్లగట్ట స్వాతి, అన్నపూర్ణ,జయశ్రీ, గట్టు భారతి, విజయ, తార,రజిత పాల్గొన్నారు.

## స్పోర్ట్స్, కల్చరల్ మీట్ -2025 ప్రారంభించిన ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు



**హనుమకొండ, మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** టిఆర్ఎస్ ఎంఏ (వడుప్సా) వారి ఆధ్వర్యంలో మడికొండ (సోమిడి) గ్రామంలోని రామన్ హై స్కూల్ నిర్వహించిన స్పోర్ట్స్ , కల్చరల్ మీట్ – 2025 కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొని జ్యోతీ ప్రజ్వలన చేసి ఆటలను ప్రారంభించారు. తొలుత రామన్ స్కూల్ పాఠశాల విద్యార్థులు బ్యాండ్ గ్రూపు తో ఎమ్మెల్యే నాగరాజు ని ఘన స్వాగతం పలికారు.అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రిన్సిపాల్, టీచర్ల నిర్వహించిన మార్చ్ ఫస్ట్ వీక్షించారు.తదనంతరం ఎమ్మెల్యే నాగరాజు టిఆర్ఎస్ఎంఏ (వడుప్సా) జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పోర్ట్స్ కల్చరల్ పోటీలకు సహకరించిన వారికి శాలువాలతో సత్కరించారు. అనంతరం రామన్ స్కూల్ లోని సైన్స్ ల్యాబ్ ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే నాగరాజు కి సత్కరించి బహుమతులు ప్రధానం చేసిన స్పోర్ట్స్ మీట్ సభ్యులు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ఎంఏ (వడుప్స) కన్వీనర్ శ్రీ సతీష్ కుమార్ , నారాయణరెడ్డి, భాగిరావు, టిఆర్ఎస్ ఎంఏ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ నాగార్జున రెడ్డి, శ్రీ వెంకట్ రెడ్డి వీరమల్లు, సాంబయ్య, దేవేందర్ రెడ్డి, రామన్ స్కూల్ కరస్పాండ్ రాజేష్ కుమార్ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ గిరిధర్ రావు ఉమ్మడి జిల్లాల కరస్పాండెంట్, కాజీపేట, వర్ధన్నపేట మండలాల అధ్యక్షులు సారంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎద్దు సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు వస్కుల నాగరాజు , కక్రహరీష్ రెడ్డి జన్నపురెడ్డి రుగ్వేద రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థి విద్యార్థినీలు పాల్గొన్నారు.

## ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు భద్రతాపరమైన ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలి

**జగిత్యాల, మర్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ధర్మపురి లో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈనెల 10వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరుగు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఏలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో, కోనేరు, క్యూలైన్లలో, వాహనాల రాకపోకలు మొదలైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయవలసిన భద్రత ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.భక్తుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ వెంట డిఎస్పి రఘు చందర్, స్థానిక తహశీల్దార్ కృష్ణ చైతన్య, సి.ఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్.ఐలు ఉదయ్ కుమార్, ఉమసాగర్ ఉన్నారు.







## జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపైన అవగాహన శిక్షణలో జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్



**జగిత్యాల, మర్చి 7 ( పిసిడబ్ల్యూ న్యూస్):** శుక్రవారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్, ఎంపీడీవో, ఎంపీఓ, సబ్ రిజిస్టర్ అధికారులు సంబంధిత అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా మండల వారిగా ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల వివరాలను మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు చేస్తారు మండల వారిగా ఆరా తీశారు. కచ్చితంగా ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల లబ్ధిదారులు క్రమబద్దీకరణ పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల లే అవుట్ క్రమబద్ధీకరణ పైన పలు అంశాలపై పై దిశా నిర్దేశం చేశారు. ఎల్ ఆర్ ఎస్ పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు ఎంపీడీవో ,ఎంపీవోలు ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల చేసుకుంటే 25% శాతం తగ్గింపు వర్తిస్తుంది. కావున దీనిని సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఫ్రైవేట్ లైసెన్స్ సర్వేయర్లకు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ నెల 31 వరకు చివరి రోజు కావున ఎక్కువ మొత్తంలో దరఖాస్తుల చేపట్టాలని అన్నారు.ఎల్1 ఎల్ 2 ఎల్ 3 రెవిన్యూ ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.లే అవుట్ క్రమబద్ధీకరణ అనేది ప్రభుత్వం సామాన్య ప్రజలకు భారం తగ్గించాలని అనే ఉద్దేశంతో ఎల్ ఆర్ ఎస్ రాయితీ ఇచ్చింది అన్నారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం అని ఏమైనా సలహాలు ఇబ్బందులు ఉన్నా కాల్ సెంటర్లోని సంప్రదించాలని ప్రవేట్ బిల్డర్స్ తెలిపారు. ఈ సమావేశంలో, అదనపు కలెక్టర్ బి.ఎస్ లత డిపిఓ మధన్ మోహన్, టౌన్ ప్లానింగ్ శుక్రవారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్, ఎంపీడీవో, ఎంపీఓ,సబ్ రిజిస్టర్ అధికారులు సంబంధిత అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా మండల వారిగా ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల వివరాలను మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు చేస్తారు మండల వారిగా ఆరా తీశారు. కచ్చితంగా ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల లబ్ధిదారులు క్రమబద్ధీకరణ పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల లే అవుట్ క్రమబద్ధీకరణ పైన పలు అంశాలపై పై దిశా నిర్దేశం చేశారు. ఎల్ ఆర్ ఎస్ పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు ఎంపీడీవో, ఎంపీవోలు ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల చేసుకుంటే 25% శాతం తగ్గింపు వర్తిస్తుంది. కావున దీనిని సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అధికారులకు ఫ్రైవేట్ లైసెన్స్ సర్వేయర్లకు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ నెల 31 వరకు చివరి రోజు కావున ఎక్కువ మొత్తంలో దరఖాస్తుల చేపట్టాలని అన్నారు.ఎల్1 ఎల్ 2 ఎల్ 3 రెవిన్యూ ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. లే అవుట్ క్రమబద్ధీకరణ అనేది ప్రభుత్వం సామాన్య ప్రజలకు భారం తగ్గించాలని అనే ఉద్దేశంతో ఎల్ ఆర్ ఎస్ రాయితీ ఇచ్చింది అన్నారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం అని ఏమైనా సలహాలు ఇబ్బందులు ఉన్నా కాల్ సెంటర్లోని సంప్రదించాలని ప్రవేట్ బిల్డర్స్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత డిపిఓ మధన్ మోహన్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. శ్రీనివాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 25న మాజీ ప్రధాని వాజపేయి శతజయంతి ఉత్సవాలు

- ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయకర్త

బిజెపి నాయకులు, మాజీ ఎంపీ సీతారాం నాయక్



**హనుమకొండ, మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డిసెంబరు 25వ తేదీ 2024 నుంచి అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలను సంవత్సరం పొడవుగా నిర్వహిస్తున్న సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో 'అటల్ జి యాదిలో నేను' అనే కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు, అందులో ప్రజలతో కానీ,పార్టీ నాయకులతో కానీ అటల్ జి తో ఉన్న స్మృతులను కలెక్ట్ చేసి వాటిని ఒక ప్రదర్శన నిర్వహించనున్నట్లు అటల్ జి యాదిలో నేను కార్యక్రమ ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయకర్త బిజెపి నాయకులు, మాజీ ఎంపీ సీతారాం నాయక్ శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్ దీన్ దయాళ్ నగర్ లోని బిజెపి జిల్లా కార్యాలయంలో బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ యొక్క విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైై సీతారాం నాయక్ మాట్లాడారు. గతంలో వరంగల్ మాజీ ఎంపీ స్వర్గీయ చందుపట్ల జంగారెడ్డి కి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వ్రాసిన లేకను వారు ప్రదర్శించారు.ఈ సమావేశంలో బిజెపి నాయకులు మాజీ మేయర్ డా టీ.రాజేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే మార్థినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి, రాష్ట్ర నాయకులు డా పగడాల కాళి ప్రసాద్, జిల్లా నాయకులు సంద్ర మధు, అరణ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**హనుమకొండ, మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శుభాకాంక్షలు తెలిపారు. పురుషులతో పాటు అన్ని రంగాల్లో మహిళలది సమాన పాత్ర ఉంటుందని, కుటుంబ అభివృద్ధిలో స్త్రీ పాత్ర త్యాగపూరితమైనదన్నారు. "శక్తి స్వరూపిణి స్త్రీ.. బహుకృత రూపిణి స్త్రీ.. బహుముఖ ప్రజ్ఞాశాలి స్త్రీ మానవ సృష్టికి మూలకారిణి స్త్రీ అని అన్నారు. తల్లిగా తోబుట్టువుగా భార్యగా బిడ్డగా భిన్నరూపాలలో స్త్రీమూర్తి అందిస్తున్న సేవలు వెల కట్టలేనివి అని తెలిపారు. మహిళామణి లేని ఇల్లు దీపం లేని కోవెల వంటిదని తెలియజేశారు. ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని చెప్పుకొంటుంటామని అది సత్యమన్నారు స్త్రీలను గౌరవించే చోట శాంతిసౌభాగ్యాలు విలసిల్లుతాయని వరంగల్ ఎంపీ తెలిపారు. మానవ జాతికి మహిళ ఒక వరం. మహిళాభ్యుదయానికి చిత్తశుద్ధితో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మహిళా బంధుగా ఆదరణ పొందుతుందన్నారు.

# ఎల్.ఆర్.ఎస్‌ను నిబంధనల ప్రకారం పకడ్బందీగా అమలు

- రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్
- మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజు, ఓపెన్ స్పేస్ ఫీజు చెల్లిస్తే 25% రాయితీ
- సబ్ రిజిస్టర్‌లు ఎల్ఆర్ఎస్ కింద నూతన దరఖాస్తులు స్వీకరించాలి





**హనుమకొండ, మార్చి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్.ఆర్.ఎస్ ను నిబంధనల ప్రకారం పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్ అన్నారు.శుక్రవారం రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్ ఎల్ఆర్ఎస్ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఎల్ఆర్ఎస్ రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్ మాట్లాడుతూ.. ఎల్.ఆర్.ఎస్ 2020 క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. లేఔట్ క్రమబద్ధీకరణ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నవారు పూర్తి ఫీజు తో పాటు ప్రో- రాటా ఓపెన్ స్పేస్ చార్జి లను మార్చి 31 లోపు చెల్లిస్తే 25 శాతం రాయితీ లభిస్తుందని అన్నారు. నిషేధిత జాబితాలో లేని, బఫర్, ఎఫ్.టి.ఎల్, చెరువులు కుంటలు తదితర ప్రాంతాలలో లేని ప్లాట్ల కు ఆటోమేటిక్ గా ఎల్ఆర్ఎస్ కు అనుమతి లభిస్తుందని చెప్పారు. చెరువులు నీటి వనరులు తదితర ప్రాంతాలకు 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు మాత్రం రెవెన్యూ నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరిగా చేయాలని అన్నారు.ఎల్ఆర్ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులు 90% రిఫండ్ అవుతుందని, 10 శాతం ప్రాసెసింగ్ కోసం తీసుకుంటామని అన్నారు . స్థలాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించిన వారికి అర్హత ఉంటే స్థల క్రమబద్ధీకరణ చేసి సంబంధిత ప్రొసీడింగ్స్ జారీ చేయాలని అన్నారు. ఆగస్టు 26, 2020 వరకు 10% ప్లాట్లు విక్రయించిన లే ఔట్ లను క్రమబద్ధికరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, సబ్ రిజిస్టర్ ద్వారా నిర్ణీత నమూనాలో జిల్లా ,మండలం ,గ్రామం, సర్వే నెంబర్ విస్తీర్ణం, లేఔట్ లోని మొత్తం ప్లాట్లు క్రయ ,విక్రయ లావాదేవీలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెంబర్లు సంవత్సరం వంటి అనేక వివరాలతో నూతన దరఖాస్తులు సేకరించి ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి క్రమబద్ధీకరణ చేస్తామని అన్నారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతించడం ఉండదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమ బద్ధీకరణ చేసుకోవాలని, మార్చి 31 వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25% రాయితీ పొందాలని తెలిపారు.మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేకంగా వాట్స్ అప్ గ్రూపులు తయారు చేసి ప్రతి దరఖాస్తుదారులను ఫాలో అప్ చేస్తూ నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించేలా చూడాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య మాట్లాడుతూ జిల్లాలో వచ్చిన మొత్తం దరఖాస్తులు 82, 332, అందులో 29,517 ఆమోదించడం జరిగింది, 3089 దరఖాస్తులకు చెల్లింపు చేయడం జరిగిందన్నారు, మిగతా దరఖాస్తులు ప్రాసెస్ లో ఉన్నాయని, ప్రజలలో అవగాహన కల్పించి, త్వరలో దరఖాస్తులు పరిశీలించి పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ, పంచాయతీ సిబ్బంది సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో తోడ్పడతాయి

- క్రీడలలో చురుకుగా పాల్గొన్న న్యాయశాఖ ఉద్యోగులు
- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బి. నిర్మలా గీతాంబ




**హనుమకొండ, మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిత్యం పని ఒత్తిడిలో నిమగ్నమై ఉండే మహిళలకు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో తోడ్పడతాయని,ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలుస్తున్నారని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బి. నిర్మలా గీతాంబ అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో "అంతర్జాతీయ మహిళా దినోత్సవ" వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలు వెనుకబడి లేరని, అన్ని రంగాల్లో ముందు నిలుస్తున్నారని అన్నారు. మహిళలు ఎందులోనూ తీసుపోలేరని, ఉద్యోగాలు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, ఎన్నో అవరోధాలను దాటి ఉన్నత స్థానంలో నిలిచినందుకు మహిళా న్యాయమూర్తులు, సిబ్బంది, న్యాయవాదులకు అభినందనలు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా న్యాయమూర్తులకు, కోర్టు మహిళా ఉద్యోగినులకు ఆటలపోటీలు నిర్వహించి, విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందించారు.ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్.రమేష్ బాబు మాట్లాడుతూ..”అంతర్జాతీయంగా మహిళలు తమ హక్కులను గుర్తించి మహిళా సమానత్వం, సాధికారత,సామాజిక మార్పుపై అవగాహన తోపాటు వీటి సాధనకోసం ఉద్యమించాల్సిన కర్తవ్యాన్ని గుర్తు చేసుకునే రోజు అన్నారు. లింగ సమానత్వం, సమాజంలో మహిళల పాత్ర, మహిళలపై వేధింపులు, మహిళలకు సమాన హక్కులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. మహిళా ఉద్యోగినులకు ప్రధాన న్యాయమూర్తులు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి, అభినందనలు తెలియజేశారు. చెస్, క్యారమ్స్, షటిల్, మ్యూజికల్ చైర్, తదితర పోటీలను నిర్వహించగా పోటీలలో పాల్గొన్న మహిళలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల మహిళా న్యాయమూర్తులు మనీషా శ్రవణ్ ఉన్నమ్, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు యం.సాయి కుమార్, క్షమాదేశ్ పాండే ఇతర న్యాయమూర్తులు, వరంగల్ హనుమకొండ జిల్లాల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు తీగల.జీవన్ గౌడ్, మాతంగి.రమేష్ బాబు, మహిళా న్యాయవాదులు, కోర్టు మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.



## నిజమైన పాస్టర్లు క్రైస్తవ్యానికి వరం: చొప్పదండి ఏఎంసీ చైర్మన్ మహేష్

**రామడుగు, మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాచొప్పదండి షాలోమ్ చర్చిలో పాస్టర్లకు సన్మానం చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్.. నిజమైన సేవ చేస్తున్న పాస్టర్లు క్రైస్తవ్యానికి వరం లాంటి వారని చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్ అన్నారు.. చొప్పదండి మండల కేంద్రంలోని హెూలీ షాలోమ్ చర్చ్ లో వాయిస్ ఆఫ్ లవ్ ఫౌండేషన్ నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 మంది ఉత్తమ పాస్టర్లకు అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు.. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎన్నో రకాల ఇబ్బందులు ఉన్నాయని వాటిని ఎదుర్కొంటూ మంచిని ప్రోత్సహిస్తున్న పాస్టర్లను సన్మానం చేయడం శుభసూచకమని అన్నారు.. ఎన్నో అష్ట కష్టాలు ఎదుర్కొని సేవలో ముందుకు సాగుతున్న సేవకులను సన్మానికి ఎంపిక చేయడం అభినందనీయమని అన్నారు.. ఏసుప్రభు ప్రేమ కృపా కనికరం మంచితనాన్ని బోధిస్తూ పాస్టర్లు ముందుకు సాగుతూ ఉంటారని వారిపై కొన్ని సందర్భాల్లో మతోన్మాదులు దాడి చేయడం దురదృష్టకరమని అన్నారు.. పాస్టర్లు ప్రపంచ శాంతి కోసం ప్రజల శాంతి సౌభాగ్యం కోసం విరివిగా ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు.. అంతర్జాతీయ ప్రసంగీకులు డాక్టర్ ప్రవీణ్ పగడాల మాట్లాడుతూ క్రైస్తవ్యం పై చాలా మంది చిన్నచూపు చూస్తున్నారని.. దేవుని ప్రేమ తెలుసుకొని అన్ని రకాల ఇబ్బందులు పడుతున్న వారు సహజంగా క్రైస్తవులుగా మారుతారని అన్నారు.. ప్రపంచ క్రైస్తవులంతా శాంతి సమాధాన కోసం సమాజ సేవ కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. సందర్భంగా 25 మందికి పాస్టర్ పాస్టర్లు పాస్టరోల్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసి వారికి సర్టిఫికెట్ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఎఱ్ఱమల్లేశం, బిషప్పు శాంతి కుమార్, అమోస్ , యాది ప్రకాష్, అబ్రహం, వినయ్ సాగర్, శ్యామ్సన్ , ప్రకాష్, కొంతమంది పాస్టర్లు పాల్గొన్నారు.

## సైనికుడికి గన్ విద్యార్థికి పెన్



**రామడుగు,మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిలుకూరి బాలాజీ శివాలయ ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారాం సంకల్పం తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఊట్కూరి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మార్చిలో జరగబోయే పదవ తరగతి పరీక్ష రాస్తున్న సుమారు రెండు లక్షల 50 వేల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు” సరస్వతీ కటాక్షం “ పేరుతో పెన్నులు అందించాలని లక్ష్యంతో నేడు జెడ్పిహెచ్ఎస్ తెలంగాణ మోడల్ స్కూల్ రామడుగు జడ్పిహెచ్ఎస్ రామడుగు పాఠశా లల్లో విద్యార్థులకు పెన్నులు ప్రధానం చేయడం జరిగింది. శ్రీనివాసులు సేవా సంస్థ ప్రతినిధి అవధూత శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీటి పద్మజ, ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యా యులు శైలజ మరియు ఉపాధ్యాయులు శ్రీనివాస్ (గణితం )శ్రీనివాస్( ఇంగ్లీష్) శ్రీనివాస్( హిందీ) శ్రీనివాస్ (జూనియర్ అసిస్టెంట్) శ్రీకాంత్ కిషన్ ఎండి సర్వర్ లు పాల్గొన్నారు.

## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ నూతన కమీషనర్‌గా గౌస్ ఆలం...



**కరీంనగర్ టౌన్, మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ ఉన్నాతాధికారులను బదిలీ చేసింది. కరీంనగర్ కొత్త పోలీస్ కమిషనర్ గా గౌస్ ఆలం బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఈయన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుత కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి స్థానంలో ఈయన విధులు నిర్వహించనున్నారు.

## అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ అధ్యక్షుడిగా డాక్టర్ వాసుదేవ శ్రీనివాస్

**కరీంనగర్ టౌన్, మార్చి 07(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా సర్జన్స్(KASS) కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ శాతవా హన సర్జన్స్ నూతన అధ్యక్షుడిగా వాసుదేవ శ్రీనివాస్ను ఎన్నుకు న్నట్లు అసోసియేషన్ వర్గాలు తెలిపాయి. పలువురు డాక్టర్లు మా ట్లాడుతూ.. అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ ద్వారా పలు ఉచిత క్యాంపులు, ఆధునిక సర్జరీ మార్పులను విధివిధానాలు, కార్య చరణ రూపొందించుకొని ముందుకెళ్తామని చెప్పారు.



# పరకాలలో మరికొద్ది రోజుల్లో ప్రెస్ క్లబ్ ఎన్నికలు




**- పరకాల ప్రెస్ క్లబ్ మాజీ కన్వీనర్ దాసరి రమేష్**

**పరకాల, మార్చి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహించి చాలా ఏండ్లు గడిచాయి.కొన్ని అనివార్య కారణాల వల్ల తిరిగి ఎన్నికలు నిర్వహించుకోలేక పోయామని పరకాల ప్రెస్ క్లబ్ మాజీ కన్వీనర్ దాసరి రమేష్ అన్నారు. పాత విధానాలను పరిగణలోనికి తీసుకోకుండా నూతనంగా సభ్యత్వాలు నమోదు చేసుకొని ఎన్నికలు సజావుగా జరుపుకొనుటకు, పరకాల ప్రెస్ క్లబ్ ఎన్నికల అడ్ హక్ కమిటీ ఇటీవల ఏర్పడి ఎన్నికల ప్రక్రియ ప్రకటించింది. అడ్ హక్ కమిటీ నిర్ణయించిన విధి విధానాల ప్రకారం ఈ క్రింది నిబంధనలకు లోబడి అర్హత ఉన్న ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు సభ్యత్వం ఇవ్వాలని నిర్ణయించింది. కావున సభ్యులు నిర్ణీత సమయంలో సభ్యత్వం నమోదు చేసుకొని స్వీకరించి ఎన్నికల్లో పాల్గొనాలని కమిటీ కోరుకుంటుంది.

## సభ్యునికి ఉండవలసిన అర్హతలు...

1) పరకాల మండలం డివిజన్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు వరుసగా కనీసం 3 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి. దానికి సరిపడ ఆధారాలు, అక్రిడేషన్ కార్డు లేదా సంస్థ నుండి జిల్లా ఇంచార్జ్ నుండి గుర్తింపు కార్డు అర్హత పత్రాలు చూపించాలి. దీనితోపాటు జిరాక్స్ లు, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, 200/-రూ?లు సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యత్వము పొందగలరు.2. సభ్యత్వాల స్వీకరణ తేది. 08-03-2025 శనివారం ఉదయం 10 గం॥లకు అందరి సమక్షంలో ప్రారంభించబడుతుంది. ఈ సభ్యత్వ నమోదు ప్రక్రియ 5 రోజులు కొనసాగి తేది. 12-03-2025 సాయంత్రం 6గం॥లకు ముగుస్తుంది. తేది. 12-03-2025 బుధవారం సాయంత్రం 6 గం.. తరువాత వచ్చిన సభ్యత్వాలు స్వీకరించబడవు.3. వరంగల్ ప్రెస్ క్లబ్ లేదా ఇతర ఏ ప్రెస్ క్లబ్ లోనైన సభ్యత్వం పొంది లేదా ఓటు వేసిన సభ్యునికి సభ్యత్వం ఇవ్వబడదు.4. సభ్య త్వ నమోదు పక్రియ పూర్తి అయిన పిదప తేది. 13-03-2025 న పరకాల ప్రెస్‌క్లబ్ ఎన్నికల అడ్ హక్ కమిటీ సమావేశమై సభ్యతము, ఓటర్ లిస్ట్ పరిశీలించి (స్క్రూటిని చేసి) తుది ఓటర్ జాబిత ప్రకటిస్తుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తుంది. కావున సభ్యులు సహకరించి పరకాల ప్రెస్ క్లబ్ లో సభ్యులుగా చేరి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించుకొ నుటకు సహకరిస్తారని పరకాల ప్రెస్ క్లబ్ అడ్ హక్ కమిటి కోరుకుంటుంది.



## ఔషధాల తయారీలో నాణ్యత ప్రమాణాలు ముఖ్యం

భారత్ నుంచి వచ్చే ఫార్మాస్యూటికల్స్‌తో సహా అనేక కేటగిరీల దిగుమతులపై 25% టారిఫ్ విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడం అనేక ప్రకంపనలకు దారితీస్తోంది. ఇలాంటి ప్రతీకార సుంకాలవల్ల భారత్‌లోని ఫార్మారంగానికి ఎదురయ్యే సమస్యలు ఎలా ఉన్నా అమెరికా ఆరోగ్య భద్రతా వ్యవస్థకే ఎక్కువ నష్టం కలుగుతుందని అనేక మంది నిపుణులు ఉదహరిస్తున్నారు. భారత్‌నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తుల్లో జనరిక్, భారీ డ్రగ్స్, వ్యాక్సిన్లు, కేన్సర్, ఇతర సంక్లిష్ట వ్యాధుల నివారణకు అవసరమయ్యే బయోసిమిలర్స్ ఉంటాయి. అమెరికాలో ప్రిస్క్రైబ్ చేసిన సగానికి మించి జనరిక్ ఔషధాలు భారత్‌నుంచి ఎగుమతి అవుతున్నవే. భారత్, చైనా నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే అతి చవకైన జనరిక్ ఔషధాలవల్ల అమెరికా ఆరోగ్యభద్రతా వ్యవస్థ 2022లో 408 బిలియన్ డాలర్ల వరకు ఆదా చేయగలిగింది.భారత్‌కు చెందిన 50 బిలియన్ డాలర్ల ఫార్మా పరిశ్రమకు చెందిన సగానికి సగం ఎగుమతులు ప్రపంచం మొత్తం ఎగుమతుల్లో మూడో స్థానంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత్ నుంచి దిగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తులపై అత్యధిక సుంకాలు విధించడం కేవలం భారత ఔషధ కంపెనీలకే కాదు, అమెరికా ప్రజారోగ్య వ్యవస్థపై కూడా తీవ్ర పరిణామాల ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది. అయితే ఈ పరిస్థితుల్లో భారత ఫార్మారంగం తాను ఉత్పత్తి చేసే ఔషధాల నాణ్యతలో ఎలాంటి కళంకం లేకుండా ఉన్నత ప్రమాణాలు పాటించవలసి ఉంది. గతంలో భారత్‌లో తయారైన ఔషధాలు రోగులపై దుష్పరిణామాలు కలిగిస్తున్నాయని విదేశాల్లో చెడ్డపేరు తీసుకొచ్చిన సంఘటనలు జరిగాయి. గాంబియాలో దగ్గు, జలుబునుంచి ఉపశమనం పొందడానికి వాడే సిరప్‌లతో 66 మంది చిన్నారులు మృత్యువాతపడడం సంచలనం కలిగించింది. భారత్‌లో ఓ కంపెనీ తయారు చేసిన సిరప్‌లే చిన్నారులను బలి తీసుకున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.

# మహిళలకు అగ్రస్థానంతోనే అభివృద్ధి!



ఏటా ప్రపంచ మహిళా మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నా.. భారత్‌లో మాత్రం ఇంకా మహిళా సాధికారత రావడం లేదు. మహిళను విలాసవస్తువుగానే చూస్తున్నారు. అనేకానేక అవరోధాల మధ్య కూడా తమతమ రంగాలలో శక్తిమంతమైన మహిళగా ఆమె నిరూపించుకుంటూనే ఉంది. వ్యక్తిత్వ హననం జరుగుతున్నా..సమాజంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటూనే ఉంది. మహిళాభ్యుదయమే దేశాభ్యుదయం అని మనమంతా కీర్తిస్తూ వారిని మభ్య పెడుతున్నామని గుర్తించాలి. మహిళా సమానత్వ మే సమాజానికి హితం చెబుతున్న పాలకులు సమాన గౌరవం ఇచ్చి చట్టసభల్లో ప్రవేశించేలా చేయడంలో మాత్రం విఫలం అవుతున్నారు. మహిళల్లో స్ఫూర్తిని నింపడమే గాకుండా, వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపి వారిని మనతో సమానంగా ముందుకు తీసుకుని వెళ్లడంలో పురుష సమాజం విఫలమయ్యిందన డంలో సదేహం లేదు. ఇక దీనిని సవాల్‌గా తీసుకుని మహిళలే తమ హక్కుల కోసం పోరాడాలని గుర్తుంచుకోవాలి. మహిళల రక్షణకు మరిన్ని కఠిన చట్టాలు తీసుకుని వస్తే తప్ప వారికి రక్షణ కల్పించలేం. హత్యలు, అత్యాచారాలు నిరోధానికి పాలకులు కఠినంగా వ్యవహరించడం లేదు.మహిళలను గౌరవించే మనదేశంలో మహిళల కోసం ఏం చేశారంటూ ఏమీ లేదు.ఓ గిరిజన మహిళను రాష్ట్రపతిగా చేయడం మాత్రం అభినందించాల్సిందే. ఘనత వహించిన మోడీకి ఇవన్నీ తెలియనివి కాదు. మహిళా బిల్లును ఆమోదించినా..అది అందని ద్రాక్షగా మిగిలింది. జనాభా లెక్కల సేకరణ తరవాత డీ లిమిటేషన్‌తో దానికి లంకె పెట్టారు. దీంతో మరో రెండుమూడేళు వేచిచూడక తప్పదు. ప్రధానంగా మహిళలకు ఉద్యోగ,ఉపాధి హామిల్లో పెద్దపీట వేయాలి. అలాగే వారికి ఉచిత విద్యను అందచేయాలి. ఉన్నత చదువులకు వెళ్లే వారికి వడ్డీరహిత రుణాలు అందించాలి. మహిళా సదస్సులు నిర్వహిస్తూ....మహిళల గురించి గొప్పగా చెప్పుకుంటున్నా వారి అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. ఆడపిల్లల చదువులకు, క్రీడలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఏవీ అమలు కావడం లేదు.ఆడపిల్లల చదువులకు ప్రత్యేక రుణాలు, వడ్డీలేని పథకాలు అమలుచేసివుంటే బాగుండేది. ఉద్యోగాలు లేవు. చదువుకునే మహిళలకు కకనీసం ఫ్రీ చదువులు లేవు. విద్యా రుణాలు తీసుకుంటే కనీసం వడ్డీ మాఫీ గురించి కూడా ఆలోచన చేయడం లేదు. అలాచేసివుంటే బేటీపడావో..బేటీ బచావోకు అర్థం ఉండేది. ఆర్థిక మంత్రిగా ఓ మహిళ ఉన్నా మహిళలకు ప్రత్యేకంగా ఒనగూరుతున్న ప్రయోజనం లేదు. తక్షణం మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడంలో అధికార విపక్ష సభ్యులు ఉమ్మడిగా విఫలం అయ్యారు. బిల్లును పాస్ చేసినా అమలు కాకుండా అటకెక్కించారు. ఈ బిల్లుతో రాజకీయ లబ్ది పొందానలన్న బిజెపి ఎత్తుగడ మాత్రం ఫలించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఇలా ఏటేటా జరుపుకుంటున్నా...మన నేతల్లో మార్పు రావడం లేదు. చట్టసభల్లో వారికి రావాల్సిన వాటాను కావాలనే ఇంతకాలం అడ్డుకున్నారు. సమాజంలో మహిళలకు ఉన్న అత్యుతన్నస్థాయి గౌరవాన్ని మనమే దిగజార్చుకుంటున్నా పెద్దగా భయపడడం లేదు. చట్టసభల్లో కనీసం వారి అభిప్రాయా లకు విలువను ఇచ్చినట్లుగా ఉంటే బాగుండేది. కానీ అలా జరగడంలేదు. కేవలం వారికి శుభాకాంక్షలు చెప్పడంతో బడానేతలు తప్పించుకుంటున్నారు. తమ ధర్మాన్ని విస్మరించారు. సమాజం కూడా వారిని ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నది.. అమ్మాయి కనిపిస్తే అత్యాచారం చేయడమే లక్ష్యంగా మృగాళ్లు చెలరేగి పోతున్నారు. వారి గౌరవానికి భంగం కలిగించే అంశాలపై యుద్ధం చేయాలి. పురుషాహంకార సమాజాన్ని నిలదీయాలి. నిగ్గదీయాలి. తమ హక్కులను సాధించే వరకు పోరాటాన్ని కొనసాగించాలి. భారత రాజకీయాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నా తగినంతగా ప్రోత్సాహం మాత్రం దక్కడం లేదు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఎందుకనో రాజకీయంగా ముందుకు సాకుండా అణగ దొక్కుతున్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కారణంగా ఎందరో మహిళలు తమ సత్తా చాటుతున్నారు. అసెంబ్లీ,పార్లమెంటుల్లో మాత్రం రిజర్వేషన్ల దక్కితేనే మరింతగా రాణిస్తారు. వారిని అణచి వేయడం వల్ల 50శాతం జనాభా ఆకాంక్షలను కాలరాస్తున్న వారం అవుతున్నాం. మహిళా సాధికారతతో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పాలన సాగాలి. అన్నిరంగాల్లో మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించి నప్పుడే సామాజిక ప్రగతి సాధ్యపడుతుంది. అలాగే చదువుకునే అమ్మాయిలకు ఉచిత విద్యా రుణాలు అందాలి. అలాగే వారి ఉన్నత విద్యకు ప్రభుత్వాలు చేయూత నివ్వాలి. బేటీపడావో . . బేటీ బచావో నినాదం కార్యరూపం దాల్చాలి. మహిళలను విలాసవస్తువుగా చూసే సంస్కృతిపై కఠినంగా వ్యవహరించాలి. అత్యాచారాలు, వేధింపులపై కఠినంగా వ్యవహరించేలా చట్టాలు రావాలి. ప్రజాస్వామ్యంలో కేవలం అధికార పక్షమే కాదు ప్రతిపక్షాలకూ, ప్రజలందరికీ పాత్ర ఉంటుంది. ఇది గమనించి అందరూ ముందుకు సాగాలి. మహిళల గొప్పతనాన్ని భారతీయ మహిళల ఆదర్శాలను ప్రముఖంగా ప్రస్తావించిన మన సంస్కృతిని ముందుకు తీసుకుని వెళ్లే క్రమంలో సమాజం వారిపట్ల గౌరవభావంతో సాగాలి. విద్యా,క్రీడా, సాంస్కృతిక రంగాల్లో వారిని ముందుకు నడిపించేలా నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగాలి. అప్పుడే మనం ఆశించిన మహిళాభ్యుదయం సాకారం అవుతుంది. అలాగే మహిళల పట్ల అకృత్యాలకు పాల్పడే మృగాళ్లను కఠినంగా శిక్షించాలి. అవసరమైతే ఉరిశిక్షలకు కూడా వెనకాడరాదు. వరకట్న వేధింపులు వంటివి లేకుండా చూడాలి. పనిప్రదేశాల్లో రోణ కల్పించాలి. ఇవన్నీ కూడా అమలుకు కఠిన చట్టాలే శరణ్యం.

# దేశానికి గర్వకారణం మహిళా క్రీడాకారులు

- **భారత కీర్తిపతాకను ఎగరేసతున్నవారు ఎందరో**
- **త్రిష లాంటి వారికి మరింత ప్రోత్సాహం దక్కాలి**

**న్యూఢిల్లీ,మార్చి7:** క్రీడా రంగంలో ఇటీవలే తెలంగాణకు చెందిన గొంగడి త్రిష తారాజువ్వలా దూసుకుని వచ్చారు. తన స్వయంకృషితో ఆమె అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించారు. క్రీడారంగంలో మెరుపులు పూయిస్తున్న ఎందరో మహిళా క్రీడాకారులు భారత కీర్తిపతాకాన్ని ఎగురవేశారు. సానియా మిర్జా,సైనా నెహ్వాల్, పివి సింధు, మేరీ కోమ్,స్మృతి మందాన వంటి వారు ప్రస్తుత సమాజంలో ఇంకా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. వారు క్రీడారంగంలో చేస్తున్న కృషి భారత ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది. క్రికెట్‌లో కూడా తమకు ఎదురు లేదని చూపుతున్నారు.ఇందులో తెలుగమ్మాయి పివి సింధు ఎన్నో అద్భుతాలతో రాణించి పద్మశ్రీని దక్కించుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో మెరిసిన పి.వి.సింధు కృషి అభినందనీయం. ఆమె ఎలాంటి ప్రోత్సాహం లేకుండానే రాకెట్ పట్టి ఎంతో కఠిన దీక్షతో ఈ దశకు చేరుకుంది.ఈ యజ్ఞంలో ఆమె ఎక్కడా తడబాటుకు గురికాకుండా, ఆత్మస్థయిర్యం కోల్పోకుండా అప్రతిహతంగా ముందుకు సాగిన తీరు అభినందనీయం. ఇంతటి ఘనకీర్తి సాధించడానికి వ్యక్తిగతంగా ఆమె కష్టపడితే ఆమె కష్టానికి తల్లిదండ్రు లు, కోచ్ పుల్లెల గోపీచంద్ తోడ్పడ్డారు. అయితే ఆర్థికంగా కూడా ఆమె ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ లో పోటీపడినా స్వర్ణం గెలవడం సింధుకు మరచిపోలేని అనుభూతిగా మిగిలింది. పక్కా ప్రణాళికతో సిద్ధమై అనుకున్నది సాధించి, విశ్వకిరీటాన్ని అందుకొన్న తొలి భారత క్రీడాకారిణిగా గణుతి కెక్కింది. 'రియో'తో మొదలైన జోరును ఇంకా కొనసాగిస్తున్న సింధు ప్రపంచ టోర్నీ స్వర్ణంతో తన స్థాయిని మరింత పెంచుకుంది. అయితే ఒలంపిక్స్ పట్టికలో మనం ఎప్పుడూ కింది నుంచి ఫస్ట్ ఉండడానికి ప్రయత్నిస్తున్నాం. సింధులాంటి వారు పతకాలు సాధించారంటే అందులో ప్రభుత్వాల ఘనకార్యం ఏమీ లేదు. త్రిష లాంటి వారు దూసుకు వచ్చినా వారి సొంత కష్టమే. కోనేరు హంపి ఇలా ఎందరో ఉన్నారు. వారు తమ సొంతంగా ఆట నేర్చుకుని మన పరవును నిలబెట్టేందుకు ప్రయత్నించారు. నిజానికి ముందునుంచే ప్రభుత్వాలు వీరిని ప్రోత్సహించి ఉంటే బంగారు కొండల్లా మెరిసేవారు. బేటీ బచావో..బేటీ పడావో నినాదంగా మారరాదు. వీరి స్ఫూర్తిగా తీసుకుని ఆడపిల్లలకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. ఆడపిల్లల క్రీడలకు, విద్యకు ఉచిత సౌకర్యాలు, మినహాయింపులు ఇవ్వాలి. ఎందరినో తయారు చేసుకోవాలి. త్రిష సాధించిన విజయంతో దేశంలో మహిళా క్రికెట్‌కు మరింత ఊపు వస్తుందనడంలో సందేహం లేదు. సైనాకు తోడు సింధు, కశ్యప్, జ్వాల, అశ్విని లాంటి క్రీడాకారిణులు కూడా ప్రపంచ స్థాయికి ఎదగడంతో రాకెట్‌కు మరింత ఊపొచ్చింది.అలా అన్ని ప్రభుత్వాలు కూడాక్రీడాకారులను ప్రోత్సహించేలా నిర్ణయాలు ఉండాలి.

